మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 77 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



# అసాధారణ వ్యక్తి రామోజీరావు అస్తమయం



2లో..



రామోజీ ఓ ధృవతార

రామోజీ మహత్తర దార్శనికుడు

మీడియాను విప్లవాత్మకంగా మార్చిన యోధుడు

ఆయన మృతి పత్రికా రంగానికి తీరని లోటు

సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

సంతాపం తెలియచేసిన రాజ్‌నాథ్, ఖర్గే,మమత తదితరులు

రామోజీ వ్యక్తి కాదు..అనంతమైన శక్తి

స్వయంకృషితో పైకి వచ్చిన మహానుభావుడు

నివాళి అర్పించిన వెంకయ్య, జస్టిస్ ఎన్‌వి రమణ

రామోజీకి నివాళి అర్పించి దత్తాత్రేయ తదితరులు

4లో..

మీడియా దిగ్గజం రామోజీ కన్నుమూత

అస్వస్థతలో ఆస్పత్రిలో తుదిశ్వాస

ఫిలిం సిటీకి భౌతిక కాయం తరలింపు

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్


అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం

ఘనంగా నివాళి అర్పించిన ప్రముఖులు



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలుగు పత్రికా రంగంలో విప్లవం సృష్టించిన అక్షరం రాలిపోయింది. అనంతలోకాలకు ఎగిపోయింది. మహోన్నత పత్రికా సామ్రాజ్యాన్ని ప్రజలకు అందించిన రామోజీరావు అనంతలోకాలు వెళ్లిపోయారు. శనివారం తెల్లావారు జామున రామోజీరావు అస్తమయం చెందారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆయనను నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. మిగతా 2లో..

## ప్రజా నాడి








# నేడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం

మోడీతో ప్రమాణం చేయించనున్న రాష్ట్రపతి

ప్రమాణస్వీకారోత్సవానికి ముస్తాబైన రాష్ట్రపతి భవన్

సాయంత్రం 7.15 గంటలకు ప్రమాణ కార్యక్రమం

ఢిల్లీ అంతటా భద్రత కట్టుదిట్టం..కమెండోల పర్యవేక్షణ

ఢిల్లీకి చేరుకుంటున్న విదేశీ ప్రముఖులు

న్యూఢిల్లీ,జూన్8 (ప్రజా మంటలు):నరేంద్రమోదీ మూడోసారి భారతదేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రధానిగా ప్రమాణం చేస్తారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణం చేస్తారు. ఇందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని, మంత్రులతో ప్రమాణం చేయిస్తారు. మోడీ వరుసగా మూడోసారి ప్రమాణం చేయడం ద్వారా తొలిప్రధాని నెహ్రూ రికార్డును సమం చేయబోతున్నారు.ఇప్పటికే 2014, 2019ల్లో ఆయన రెండు పర్యాయాలు ప్రధానిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మరోసారి ప్రజలు ఎన్డీఏ కూటమికి పట్టం కట్టడంతో.. ఎన్డీఏ ఎంపీలంతా కలిసి మోదీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. దాంతో ఆయన మూడోసారి పీఎంగా ప్రమాణస్వీకారం చేసేందుకు సిద్ధమయ్యారు.సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# నేడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం



పార్లమెంటరీ పార్టీ తన నాయకుడిగా ఎన్నుకున్న తర్వాత జూన్ 7న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోదీని తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అధికారికంగా కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే గెలుపుతో మూడోసారి ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. 2014, 2019లో కాకుండా ఈ సారి మ్యాజిక్‌ఫిగర్(272)ని బీజేపీ స్వతహాగా సాధించలేకపోయింది. 240 సీట్ల వద్దే ఆగిపోయింది. దీంతో కూటమిలోని తెలుగుదేశం(టీడీపీ), జనతాదళ్ యునైటెడ్(జేడీయూ), శివసేన కీలకంగా మారాయి. మొత్తం 543 ఎంపీ సీట్లలో ఎన్డీయేకి ప్రస్తుతం 293 ఎంపీ బలం ఉంది. ఇదిలా ఉంటే మోడీ 3.0 సర్కార్‌లో మిత్రపక్షాలకు బెర్తులు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. చంద్రబాబు నాయుడు టీడీపికి నాలుగు మంత్రిత్వ శాఖలు, నితీష్ కుమార్ జేడీయూకి 2 మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం దాదాపుగా ఖరారు అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జేడీయూ నుంచి ఇద్దరు సీనియర్ నేతలైన లాలన్ సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్ల పేర్లను ప్రతిపాదించింది. ప్రస్తుతం టీడీపికి 16, జేడీయూకి 12 సీట్లు ఉన్నాయి. ఇదిలావుంటే అనధికార సమాచారం మేరకు మోడీతో పాటు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా తదితరులు ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తున్న తొలి వ్యక్తిగా నరేంద్రమోదీ గుర్తింపు పొందారు. ప్రమాణస్వీకారం నేపథ్యంలో రాష్ట్రపతి భవన్ పరసరాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అదేవిధంగా భద్రతా కారణాల రీత్యా ఢిల్లీని నో ఫ్లై జోన్‌గా కూడా ప్రకటించారు. డ్రోన్‌లు, పారా గ్లైడర్‌లు, ఎయిర్ బెలూన్స్ లాంటివి ఎగుర వేయకుండా నిషేధం విధించారు. కాగా మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్, మాల్దీవ్స్ తదితర దేశాల అధినేతలు హాజరుకానున్నారు. దీంతో భద్రత కోసం పలు ప్రాంతాల్లో రహదారులన్నింటిని మూసివేయనున్నారు. ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

### ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ , ఎస్ కెఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల



జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆదివారం నిర్వహిస్తున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎస్ కె ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష చీఫ్ సూపరిండెంట్ అరిగెల అశోక్ తెలిపారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షకు సంబంధించి ఇన్విజిలేటర్లకు శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఏవైనా సమస్యలు తలెత్తితే చర్యలు తప్పవని ఆదేశించారు. అభ్యర్థులు కూడా ఉదయం 10 గంటలకు గంట ముందుగానే సెంటర్ కి చేరుకోవాలని నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని పేర్కొన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ మరియు నిషేధిత వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని, అభ్యర్థులు హాల్ టికెట్, ఐడి ప్రూఫ్, బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్నులతో మాత్రమే పరీక్షకు హాజరవ్వాలని చీఫ్ సూపరిండెంట్ , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరిగెల అశోక్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అబ్జర్వర్ డాక్టర్ పడాల తిరుపతి, డిపార్ట్మెంట్ ఆఫీసర్ డాక్టర్ బోనగిరి నరేష్, ఇన్విజిలేటర్లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రామోజీరావు మరణం తెలుగు వారందరికీ తీరని లోటు

### మాజీ మంత్రి గుడిసెల రాజేశం గౌడ్

హైదారాబాద్ జూన్ 08 (ప్రజామంటలు):





తెలుగు పత్రికా రంగంలో మకుటంలేని మహారాజు, ఏనాటికానాడు ఈనాడు. తెలుగు నుడికారంలో అన్ని యాసల ప్రయోగ ప్రయోక్త, చేతలతో చైతన్యం నింపిన చెరుకూరి రామోజీ రావు, భారత పద్మ విభూషణుడు, అనితర సాధ్యమైన లక్ష్యాలను తానే ప్రోదిచేసుకుని, గెలిచితీరిన విలుకాడు అంతరించడం ఎందరికో కోలుకోలేని దెబ్బ. ఆయన నడిచిన బాట ఎందరికి స్ఫూర్తిదాయకం. అంచెలంచెలుగా ఎదిగిన, గెలిచిన గొప్ప వ్యక్తిత్వం రామోజీరావు. అస్తమయం తెలుగు వారికి తీరని వెలితి. కిరణ్ కు కుటుంబానికి ప్రగాఢ సంతాపం. రామోజీ రావు దివంగతాత్మకు శాశ్వత ప్రశాంతి కోసం పరమాత్మను కోరుకొంటున్నాను అన్నారు.

# బూడిద లారీలను అడ్డుకున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

### మంత్రి పొన్నంను బర్తరఫ్ చేయాలి





హుజురాబాద్ జూన్ 08 (ప్రజామంటలు): ఎన్టిపిసి లోని ఫ్లై యాష్ (బూడిద) ను జాతీయ రహదారి పనుల కోసం ఖమ్మం కు ప్రతిరోజు అధిక లోడులతో లారీలు తరలి వెళు తున్నాయని, దీనికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అండ ఉందని హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణ శివారులోని కాకతీయ కెనాల్ వద్ద ఎన్టిపిసి నుండి ఫ్లై యాష్ ను తీసుకెళ్తున్న లారీలను ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అడ్డుకున్నారు. లారీలను కాంట వేయించగా ఒక లారీ 73 టన్నులు, మరొక లారీ 76 టన్నుల బరువు తేలింది. దీనిని వెంటనే ఆర్టిఓ అధికారులకు ఆయన అప్పచెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఎన్ టిపిసి లో అధికంగా ఉన్న ఫ్లై యాష్ ను జాతీయ రహదారి కోసం ఉచితంగా అందజేస్తుంది. కాగా జాతీయ రహదారి పనుల కోసం ఒక లారీలో 32 టన్నులను తీసుకొని వెళ్లడానికి అనుమతి ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఎన్టిపిసి లోని ఫ్లై యాష్ ను 70 నుండి 100 టన్నుల లారీలలో తీసుకొని ప్రతిరోజు వెళ్తున్నాయి. అధిక లోడ్లతో లారీలు బూడిదను తీసుకెళ్తుండడం వల్ల రోడ్లు పాడవడమే కాకుండా అనేక రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్నాయని అన్నారు. నిబంధనల మేరకు కాకుండా లారీలలో 70 నుండి 100 టన్నుల ఫ్లైయాష్ ను లారీలలో తరలిస్తూ అధికంగా తరలిస్తున్న బూడిద డబ్బులను మంత్రి పొన్నం ప్రభాకర్ కు అందజేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిరోజు 200 లారీలు తరలిపోతున్నాయని దీనివల్ల రోజుకు 50 లక్షల రూపాయలు మంత్రి పొన్నం ప్రభాకర్ కు సదరు కాంట్రాక్టర్ అందజేస్తున్నాడని అన్నారు. అందువల్లనే రోడ్లు పాడవుతున్న, అధిక లోడుతో వెళ్లే లారీలను ఆర్టీవోలు అడ్డగించడం లేదని ఆయన అన్నారు. ఇటీవల హుజురాబాద్ ప్రాంతంలో 13 ఫ్లై యాష్ అధిక లోడుతో లారీలు వెళుతుండగా డిటిసి కరీంనగర్ కి ఫిర్యాదు చేసినప్పటికీ వాటిని హుజురాబాద్ లో ఆపి రెండు మాత్రమే సీజ్ చేసి మిగతావి డ్రైవర్లు లేరని సాకుతో పంపించి వేశారని, దీని అంతటికి కారణం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అని ఆయన అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అండదండలతో ఈ అక్రమ దందా కొనసాగుతుందని వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఆయనను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముత్యంరాజు కుమారస్వామి, తిరుమల్ రెడ్డి, రమాదేవి సుశీల హుజురాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, నాయకులు గందె శ్రీనివాస్, ఇరుమల్ల సురేందర్ రెడ్డి, మొలుగూరి పూర్ణచందర్, చింత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# గ్రూప్ -1 ప్రిలిమినరి పరీక్షకు పటిష్టమైన పోలీసు బందోబస్తు

**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**

**జిల్లా వ్యాప్తంగా 22 సెంటర్లలో పరీక్ష రాయనున్న 7692 మంది అభ్యర్థులు..**


**జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్**

జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు): గ్రూప్–%×% రాత పరీక్ష కు సంబంధించి జిల్లాలో మొత్తం 22 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని ఈ యొక్క పరీక్ష కేంద్రాల వద్ద కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని మరియు పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, మరియు చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు, మూసి వేయాలని, మరియు పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని ఎస్పీ తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద 300 మ%శీ%ది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.అభ్యర్థులు పరీక్షా సమయాని కంటే 1 గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటు వంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. అభ్య ర్థులు చివరి నిమిషంలో వచ్చి ఇబ్బంది పడకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, సెల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచ్లు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదు అన్నారు.

# రామోజీరావు మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసింది

### వేములకుర్తి లో రామెజీరావు చిత్రపటానికి నివాళి

### పడిపోయా సినిమా నిర్మాత, సినియర్ జర్నలిస్ట్, భరత్ కుమార్ అంకతి



ఇబ్రహీంపట్నం జూన్ 08 (ప్రజామంటలు):

రామోజీరావు మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసిందని పడిపోయా సినిమా నిర్మాత, సినియర్ జర్నలిస్ట్ భరత్ కుమార్ అంకతి అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో రామెజీరావు చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ.... రామెజీరావు ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించి,అక్షర యోధుడుగా తెలుగు రాష్ట్రాలకు, దేశానికి ఎన్నో సేవలు అందించారని, తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్రవేసిన రామోజీ తెలుగు ప్రజల ఆస్తి, ఆయన మరణం తెలుగు ప్రజలకే కాకుండా దేశానికి కూడా తీరని లోటన్నారు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం. మీడియా రంగంలో ఆయనొక శిఖరం, ఆయన ఇక లేరు అనే విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని తెలుగు చలనచిత్ర పరిశ్రమకు, రామోజీ అస్తమయంపై వారి కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నని భరత్ పెర్కోన్నారు.నివాళులు అర్పించిన వారిలో రాధరపు ప్రభాకర్, పట్నం నర్సయ్య, ఆరె నరేంధర్, కట్కం రాజశేఖర్, అద్వాల శ్రీనివాస్, బర్మ నాగేష్, ఆరె అరుణ్, బండమీది రాజేష్ తదితరులు ఉన్నారు.

# నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలు

### సమగ్ర విచారణ జరపాలన్న కెటిఆర్

హైదరాబాద్,జూన్8 (ప్రజా మంటలు): నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. హై లెవల్ ఎక్స్ పర్ట్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన కీలకమైన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌కు సంబంధించిన కొన్ని వ్యవహారాలు చూస్తుంటే కచ్చితంగా అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం నీట్ ఎగ్జామ్‌లో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనితో తోడు ఈ సారి చాలా మంది విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారు. నీట్‌లో (?4, –1) మార్కింగ్ విధానం ఉంటుంది. ఈ లెక్కన 718, 719 మార్కులు రావటమన్నది సాధ్యమయ్యే పనికాదన్నారు. దీని గురించి ప్రశ్నిస్తే 'గ్రేస్ మార్కులు' ఇచ్చామని చెబుతున్నారు. కొంతమంది విద్యార్థులకు ఏకంగా 100 వరకు గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు తెలుస్తోంది. గ్రేస్ మార్కుల కోసం ఏ విధానం అవలంభించారన్నది చెప్పకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. నీట్ ఫలితాలను ప్రిపోన్ చేసి ఎన్నికల ఫలితాల రోజే హడావుడిగా విడుదల చేయటం కూడా ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. కొత్తగా ఏర్పడిన ఎన్డీయే సర్కార్ రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలకు సంబంధించి చాలా సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. అయితే నీట్ ఎగ్జామ్ విషయంలో బీఆర్ఎస్ తరపున పలు పశ్నలతో పాటు కొన్ని డిమాండ్లను కేటీఆర్ కేంద్రం ముందుంచారు. గత 5 ఏళ్లలో తెలంగాణ నుంచి ఏ విద్యార్థి కూడా నీట్‌లో టాప్ 5 ర్యాకింగ్‌లో లేరు. దీనికి కచ్చితంగా నీట్ ఎగ్జామ్‌లో జరుగుతున్న అక్రమాలే కారణమని మేము నమ్ముతున్నాం.గ్రేస్ మార్కుల కేటాయింపు కోసం అనుసరించిన విధానాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక ప్రామాణిక పద్ధతిలో ప్రతి విద్యార్థికి మేలు చేసేలా ఈ విధానం ఉండాలని బీఆర్ఎస్ కోరుతుంది. కానీ 1500 మంది విద్యార్థుల గ్రూప్‌కు మాత్రమే మేలు చేసే విధంగా గ్రేస్ మార్కులు కలిపారు. అది సరైన విధానం కాదు. ఈ మొత్తం వ్యవహారంపై హై లైవల్ ఎక్స్‌పర్ట్ కమిటీతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నీట్ ఎగ్జామ్‌లో జరిగిన అవకతవకలు, అక్రమాలను బయటపెట్టి అన్యాయం జరిగిన విద్యార్థులకు వారి కుటుంబాలకు న్యాయం చేయాలి. అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# తెలంగాణ ప్రయోజనాల తాకట్టు

### ఆదిత్యనాథ్ దాస్‌ను వెంలనే తొలగించాలి

### మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్,జూన్8 (ప్రజా మంటలు): తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి నుంచి ఆదిత్యానాథ్ దాస్‌ను తొలగించాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదిత్యానాథ్ దాస్ నియామకం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశిస్తున్నాడు.. శిష్యుడు రేవంత్ పాటిస్తున్నాడని తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ముందే తెలంగాణపై చంద్రబాబు పెత్తనం మొదలైందనడానికి ఈ నియామకమే నిదర్శనం అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన తెలంగాణకు రుణపడి ఉంటాడా? పదవిని లాగేస్తారన్న భయంతో చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటాడా? నాడు జలయజ్ఞం ప్రాజెక్టుల నుండి నిన్న పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేసి పనులు ఆపిన వ్యవహారంలో ఆదిత్యాదాస్‌ది కీలకపాత్రని అన్నారు. ఏపీ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తికి తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి ఎందుకు కట్టబెట్టారో ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ప్రాజెక్టుల వ్యతిరేకిగా ముద్రపడ్డ వ్యక్తిని ఏ ప్రయోజనాల కోసం ఈ పదవిలో కూర్చోబెట్టారని నిరంజన్ రెడ్డి అన్నారు. వ్యక్తిగతంగా ఒక ప్రభుత్వ అధికారిగా ఆయన పట్ల మాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ ఆంధ్రకు కృష్ణా ప్రాజెక్టుల నుండి నీటిని తరలించడంలో ఆయనది కీలకపాత్ర. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి గత పదేళ్ళుగా ఆయన ఏపీ తరపున కొట్లాడిన వ్యక్తి ఆయన తెలంగాణకు న్యాయం చేస్తాడా? కేఆర్ఎంబీలో తెలంగాణ వాదనను తొక్కిపెట్టి ప్రాజెక్టుల మీద హక్కులు కోల్పోయేలా చేసిన వ్యక్తిని నియమించడం వెనక కాంగ్రెస్ ఆలోచన ఏంటి..? పోతిరెడ్డిపాడు, దుమ్ముగూడెం, రాయలసీమ ఎత్తిపోతల పథకాలతో తెలంగాణ నీటిని తరలించడం లోనూ ఆదిత్యాదాస్‌దే కీలకపాత్ర.. అలాంటి వ్యక్తి తెలంగాణ ప్రయోజనాల కోసం కృషిచేస్తాడా? తెలంగాణ ప్రాజెక్టులు, జల వనరుల మీద అపారమైన అనుభవం, అవగాహన ఉన్న ఎందరో జల నిపుణులు ఉన్నారు వారిని పక్కనపెట్టి తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తిని ఎంచుకోవడం వెనక కారణాలేంటి..? కాంగ్రెస్ పాలనలో పాలమూరు మరోసారి ఎడారి అయ్యేలా ఉంది అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## జగన్, కెసిఆర్‌లకు బుద్ధి చెప్పిన ప్రజలు: వివేక్

తిరుమల,జూన్8 (ప్రజా మంటలు): తెలుగు రాష్ట్రాల మాజీ సీఎంలపై చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కేసీఆర్, జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. అహంకారంతో విర్రవీగితే ప్రజలు ఇలాగే సమాధానం చెప్తారని ఘాటుగా స్పందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ.. తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోడీకి సైతం ఆదరణ తగ్గిందని, దానికి ఎన్డీయే కూటమి గెలుపొందని సీట్లే నిదర్శనమన్నారు ఎమ్మెల్యే వివేక్. లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఈడీ, సీబీఐలతో అభ్యర్థులను బెదిరించి గెలవాలని చూసిందని ఆరోపించారు. కానీ ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి లోక్ సభ, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీ వచ్చిందన్నారు. పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణ మంచి మెజారిటీతో గెలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అహంకార నేతలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు.

# జగన్ పాలనలో రేషన్ డీలర్లకు నరకం

### డీలర్ల సంఘం అధ్యక్షుడు దివి లీలా మాధవరావు

విజయవాడ,జూన్8 (ప్రజా మంటలు): ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లుగా రేషన్ డీలర్లకు వైసీపీ ప్రభుత్వం నరకం చూపించిందని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. నాలుగు దశాబ్దాల రేషన్ డీలర్ల చరిత్రలో ఎప్పుడూ పడని నరకాన్ని జగన్ హయంలో అనుభవించామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం నిర్వాహణ దారుల సంక్షేమ సంఘం ఆంధప్రదేశ్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' నందమూరి తారక రామారావు దగ్గర్నుంచీ ఐదేళ్ల క్రితం వరకూ రేషన్ డీలర్లను ఎంతో గౌరవప్రదంగా చూశారు. కానీ ఐదేళ్ల జగన్ పాలనలో ఎన్నో బాధలు పడ్డాం. ముఖ్యంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరావు మమ్మల్ని ఎంతో అవమానించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మాకు చాలా ఆనందంగా ఉంది. మాకు న్యాయం చేస్తామంటూ కూటమి మేనిఫెస్టోలో పెట్టడం చాలా సంతోషకరం. డీలర్లలందరికీ పూర్వ వైభవం నెల రోజుల్లోనే వస్తుందని ఆశిస్తున్నాం. గౌరవ వేతనం, కమిషన్, జీవో నెంబరు 5లో ఉన్న సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకే ఈసారి ఏపీ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో డీలర్లంతా కూటమి వెంటే ఉండి వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలన్నీ మా ద్వారానే పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని' అని చంద్రబాబుకు మాధవరావు విజ్ఞప్తి చేశారు.

## మచిలపట్నం సమస్యలపై ఎమ్మెల్యే కొల్లు ఆరా

**మంచినీటి సమస్యలప అదికారులతో సమీక్ష**

మచిలీపట్నం,జూన్8(ప్రజా మంటలు): ఎన్నికైన వెంటనే అలసత్వం ప్రదర్శించక టీడీపీ ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగుతున్నారు. తమ నిజయోజకవర్గంలోని సమస్యలపై అధికారులను కలిసి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర రంగంలోకి దిగారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ఆకస్మిక పర్యటనలతో కొల్లు రవీంద్ర అధికారులను హడలెత్తిస్తున్నారు. తొలిగా మచిలీపట్నం హెడ్ వాటర్ వర్క్సలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

మచిలీపట్నంలో నెలకొన్న తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుండటంపై ఏఈ సాయిప్రసాద్‌పై కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యకు గల కారణాలను మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# రామోజీ మహత్తర దార్శనికుడు

**మీడియాను విప్లవాత్మకంగా మార్చిన యోధుడు**

**ఆయన మృతి పత్రికా రంగానికి తీరని లోటు**

**సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ**

**సంతాపం తెలియచేసిన రాజ్‌నాథ్, ఖర్గే,మమత తదితరులు**

న్యూఢిల్లీ,జూన్8(ప్రజా మంటలు):
మీడియా దిగ్గజం రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మోదీ రామోజీరావుకు నివాళులు ప్రకటించారు. భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడు రామోజీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన సహకారం జర్నలిజం, సినిమా ప్రపంచంలో చెరగని ముద్ర వేసిందన్నారు. రామోజీ అవిశ్రాంత ప్రయత్నాల కారణంగా మీడియా, వినోద ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు, కొత్త ప్రమాణాలు నెలకొల్పారని వెల్లడించారు. ఈ క్రమంలో రామోజీరావు మృతికి సంతాపం తెలుపుతూ భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడని ప్రధాని మోదీ అభివర్ణించారు. దీంతోపాటు ఆయనతో మాట్లాడటం, ఆయన నుంచి ప్రయోజనం పొందే అవకాశాలు లభించడం నా అదృష్టమని మోదీ అన్నారు. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అసంఖ్యాక అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు చెప్పారు. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురిచేసినట్లు తెలిపారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు. రామోజీరావు మృతితో దేశం ఓ మీడియా దిగ్గజాన్ని కోల్పోయిందన్నారు. 'రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. రామోజీరావు ఓ వినూత్న వ్యాపారవేత్త. ఈనాడు వార్తా పత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. తన దూరదృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంలో చెరగని ముద్రవేశారు. మీడియా, సినీ పరిశ్రమలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. పద్మవిభూషణ్ అందుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి' అని రాష్ట్రపతి ముర్ము తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రామోజీరావు మృతి పట్ల భాజపా, కాంగ్రెస్ అగ్రనేతలు రాజ్‌నాథ్‌సింగ్, మల్లికార్జున ఖర్గే సంతాపం ప్రకటించారు. రామోజీరావు మరణం మీడియా, సినీ రంగానికి తీరని లోటని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. మీడియా, చలనచిత్రాల రంగాల్లో ఆయన తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పాత్రికేయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. సినీ నిర్మాతగా, మీడియా సంస్థల అధినేతగా, విద్యావేత్తగా రామోజీరావు అనేక సేవలు అందించారని, ఆయన మరణం విచారకరమన్నారు. మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దూరదృష్టి గల వ్యక్తి రామోజీరావు అని అన్నారు. సినిమా, పాత్రికేయ రంగానికి విశేష కృషి చేశారని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ఖర్గే ప్రకటించారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుమృతి పట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు రామోజీరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఈనాడు గ్రూప్, ఈటీవీ నెట్‌వర్క్, ఫిల్మ్ సిటీ వ్యవస్థాపకులు రామోజీరావు మరణవార్త దిగ్భ్రాం÷–రతికి గురిచేసింది. కమ్యూనికేషన్ ప్రపంచానికి ప్రత్యేకంగా తెలుగు మీడియాకు ఆయన దార్శనికుడు. ఆయన గురించి నాకు బాగా తెలుసు. మంచి పరిచయం ఉంది. ఓసారి ఫిల్మ్‌సిటీకి నన్ను ఆహ్వానించారు. ఫిల్మ్‌సిటీ సందర్శన మధురానుభూతి నాకు ఇంకా గుర్తుంది. ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభులాషులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని దీదీ పోస్ట్ పెట్టారు.

## రామోజీ మృతికి చంద్రబాబు దిగ్భ్రాంతి

**మీడియా రంగంలో ఆయనది ప్రత్యేక శకం**

**అసామాన్య విజేత అంటూ చంద్రబాబు నివాళి**



అమరావతి,జూన్8 (ప్రజా మంటలు):
ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయంపై తెదేపా అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని అన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఢిల్లీలో ఉన్న చంద్రబాబు నేరుగా ఫిల్మ్‌సిటీకి చేరుకుని భార్యతో కలసి రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని.. కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన రామోజీరావు తెలుగు ప్రజల ఆస్తి అని.. ఆయన మరణం రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా తీరని లోటని చంద్రబాబు అన్నారు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం అని పేర్కొన్నారు. ఈనాడు గ్రూపు సంస్థలు స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేకమైన శకం అని చంద్రబాబు కొనియాడారు. ఎన్నో సవాళ్లను, సమస్యలను అధిగమించి...ఎక్కడా తలవంచకుండా విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు

తన ప్రయాణంలో అనుక్షణం ప్రజల మంచి కోసం, సమాజ హితం కోసం రామోజీరావు పనిచేశారని అన్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరమని, ఆయన ఇక లేరు అనే విషయాన్ని తాము జీర్ణించుకోలేక పోతున్నామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రామోజీరావుతో తన 4 దశాబ్దాల అనుబంధాన్ని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మంచిని మంచి, చెడును చెడు అని చెప్పే ఆయన తీరు.. తనను ఆయనకు ఎంతో దగ్గర చేసిందని అన్నారు. సమస్యలపై పోరాటంలో ఆయన తనకు ఒక స్ఫూర్తి అని కొనియాడారు. ప్రజలకు మంచి పాలసీలు అందించే విషయంలో తాను రామోజీ సూచనలు, సలహాలు తీసుకునేవాడినని గుర్తు చేసుకున్నారు. రామోజీ అస్తమయంపై ఆయన కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రబాబు ప్రార్థించారు.

## రామోజీ రావు పేదల పక్షపాతి

**నివాళి అర్పించిన నారా లోకేశ్**

హైదరాబాద్,జూన్8(ప్రజా మంటలు): మీడియా దిగ్గజం, ప్రముఖ పారిశ్రామిక వేత్త రామోజీ రావు మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. 'రామోజీ రావు పేదల పక్షపాతి అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అభిప్రాయ పడ్డారు. 'అలు పెరుగని అక్షర యోధుడు. జనహితమే తన అభిమతంగా అనుకున్నారు. జీవితాంతం నిబద్ధతతో పనిచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్ఫూర్తితో పనిచేశారు అని' నారా లోకేశ్ అభిప్రాయ పడ్డారు. ఞామోజీ రావు మృతిపై హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. 'తెలుగు పత్రికా రంగంలో రామోజీరావు మకుటం లేని మహారాజు. పత్రికా రంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. భావితరాల పత్రికా ప్రతినిధులకు మార్గదర్శిగా నిలిచారు. చిత్రసీమలో అదేవిధంగా వెలిగిచారు. తెలుగు నేలపై అతిపెద్ద స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మించారు. తన తండ్రి ఎన్టీఆర్‌తో రామోజీరావుకు ప్రత్యేక అనుబంధం ఉండేది. రామోజీ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి కలుగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని' నందమూరి బాలకృష్ణ అభిప్రాయ పడ్డారు



## బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు

**ఆయన లేరన్న వార్త జీర్ణించకోలేక పోతున్నా**

**తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జనసేనాని**

అమరావతి,జూన్8 (ప్రజా మంటలు): బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు లేరనే వార్త ఆవేదన కలిగించిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. అక్షరయోధుడు రామోజీ రావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రాం÷–రతికి లోనయ్యానన్నారు. అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారని తెలిశాక.. కోలుకొంటారని భావించానని పవన్ తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. రామోజీరావు స్థాపించిన ఈనాడు పత్రిక భారతీయ పత్రికా రంగంలో పెను సంచలనంగా మారిందని పవన్ తెలిపారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ, జన చైతన్యాన్ని కలిగించారని పవన్ తెలిపారు. వర్తమాన రాజకీయాలపై, పాలన తీరుతెన్నులపై నిష్కర్షగా వార్తలను అందించడమే కాదని.. ఆ వార్తలను ఉషోదయానికి ముందే పాఠకుడికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేయడం రామోజీరావు దక్షతను తెలియచేసిందన్నారు. ప్రజా ఉద్యమాలకు రామోజీ వెన్నుదన్నుగా నిలిచారని పవన్ అన్నారు. పత్రికాధిపతిగానే కాకుండా సినీ నిర్మా తగా, స్టూడియో నిర్వాహకులుగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా విజయాలు సా ధించారన్నారు. రామోజీఫిల్మ్‌సిటీనిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్ ను వేదికగా చేశారన్నారు. మీడియా మొఘల్‌గా రామోజీరావు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. తను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు వెళ్ళడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయత సాధించారన్నారు. అక్షర యోధుడు రామోజీ రావు గారు అస్తమయం తెలుగు ప్రజలందరినీ కలచి వేస్తోందన్నారు. ఆయన స్ఫూర్తిని నవతరం పాత్రికేయులు అందిపుచ్చుకోవాలన్నారు. రామోజీరావు కుటుంబానికి తన తరఫున, జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతిని పవన్ తెలిపారు.

## రామోజీ మృతికి సిపిఎం సంతాపం

**నివాళి అర్పించిన ఏచూరి, రాఘవులు**

విజయవాడ,జూన్8(ప్రజా మంటలు):
ఈనాడు సంస్థలు, ప్రముఖ వ్యాపారవేత్త రామోజీరావు మరణం బాధాకరమని సిపిఐ(యం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. రామోజీరావు తెలుగు మీడియా రంగానికి నూతన ఒరవడి దిద్దారని, పత్రికా విలువలు నిలబెట్టడంలో ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. సుందరయ్య, రాజేశ్వరరావు లాంటి ప్రముఖ కమ్యూనిస్టు నాయకుల్ని రామోజీరావు ఎంతో అభిమానించేవారని తెలియజేశారు. రామోజీరావు మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి లోటని పేర్కొన్నారు.



# చిక్కోలుకు అరుదైన అవకాశం రానుందా?

**అచ్చన్నకు రాష్ట్రంలో..రామన్నకు కేంద్రంలో పదవులు**

**రికార్డు సృష్టించబోతున్న కింజారపు కుటుంబం**

శ్రీకాకుళం,జూన్8(ప్రజా మంటలు):
కొత్త ప్రభుత్వం ఏర్పడబోతున్న తరుణంలో ..జిల్లా ప్రాధాన్యం పెరగనుంది. చంద్రబాబు మంత్రివర్గంలో అచ్చన్నాయుడు ఖచ్చితంగా మంత్రి అవుతారని ప్రచారం ఉంది. టిడిపి అధ్యక్షుడిగా, సీనియర్ నేతగా ఉన్న అచ్చన్నకు తొలి జాబితాలోనే పదవి దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదిలావుంటే ఎర్రన్నాయుడు తనయుడు రామమోమన్ నాయుడు కూడా కేంద్రంలో ఏర్పడబోయే ఎన్‌డిఎ ప్రభుత్వంలో చోటు దక్కించుకుంటారని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే ఒకే ఇంటినుంచి ఒకరు రాష్ట్రంలో, మరొకరు కేంద్రంలో మంత్రులుగా ఉన్న ఘనత శ్రీకాకుళానికి దక్కనుంది. ఇకపోతే మొన్నటి సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయ ఢంకా మోగించారు.. ఎనిమిదికి ఎనిమిది చోట్లా క్లీన్‌స్వీప్ చేశారు. విజేతల్లో నలుగురు కొత్తగా అసెంబ్లీ మెట్లు ఎక్కుతుండగా, మిగిలిన నలుగురు సీనియర్లే. ఈనెల 12న నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు క్యాబినెట్‌లోకి మంత్రులుగా కొందరు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి మంత్రి యోగం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ జిల్లా వాసుల్లో నెలకొంది. ముఖ్యంగా తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బెందాళం అశోక్, మహిళా కోటాలో గౌతు శిరీష కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియారిటీ, సామాజిక వర్గాల ప్రాతిపదికన జిల్లాకు రెండు పదవులు దక్కే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. టెక్కలి నుంచి మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన కింజరాపు అచ్చెన్నాయుడు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడిగా కీలక నేతగానూ ఉన్నారు. దీనికితోడు జిల్లాలోనూ సీనియర్ నేతగా కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంపై తిరుగులేని పోరాటం చేశారు. అక్రమాలు, అవినీతిని ఎండగట్టారు. కష్టసమయంలో జిల్లా ప్రజలకు అండగా నిలిచారు. జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్రపోషిస్తున్నారు. ఈ పరిస్థితులతో అచ్చెన్నాయుడుకు బెర్తు ఖాయమనే పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గం నుంచి కూన రవికుమార్, ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్ పేర్లు వినిపిస్తున్నాయి. అశోక్ మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. సౌమ్యుడిగా పేరు ఉంది. 2019లో వైకాపా గాలిలోనూ విజయం సాధించారు. కూన రవికుమార్ ఆమదాలవలస నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచారు. తాజాగా స్పీకరు తమ్మినేని సీతరాంపైనే పోటీ చేసి గెలుపొందారు. కష్టకాలంలో తెదేపా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి కార్యకర్తలకు అండగా నిలిచారు. అధికార పక్ష నేతలు కేసులు పెట్టి అనేక ఇబ్బందులకు గురిచేశారు. గతంలో విప్‌గానూ పనిచేశారు. అశోక్, కూన ఇద్దరూ సీనియర్లు, ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఒక్కరి చోటు కల్పించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. మంత్రి పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే. మహిళ, యువత కోటాలో పలాస నుంచి గౌతు శిరీష మంత్రి పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. గౌతు లచ్చన్న మనవరాలిగా, మాజీ మంత్రి గౌతు శివాజీ కుమార్తెగా ప్రజల ముందుకొచ్చారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన శిరీష అటు వైకాపా మంత్రి అప్పలరాజు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసినా వాటిని ఎదుర్కొని అప్పలరాజుపై ఘన విజయం సాధించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి కార్యకర్తలకు ధైర్యం నింపుతూ అడుగులు వేశారు. దీంతో ఆమెకు క్యాబినెట్‌లో చోటు దక్కుతుందని కార్యకర్తలు, నేతలు ఆశిస్తున్నారు. ఇకపోతే మాజీ కేంద్రమంత్రి, దివంగత ఎర్రన్నాయుడు వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని,

పార్లమెంట్ సభ్యుడిగా మూడుసార్లు గెలుపొందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు హ్యాట్రిక్‌తో సత్తాచాటారు. 2014 ఎన్నికల్లో తొలిసారి 1.27 లక్షలకు పైగా మెజార్టీ సాధించారు. తాజా ఎన్నికల్లో 3,27,901 ఓట్ల మెజార్టీతో రికార్డు సృష్టించారు. ఈ విజయం జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలిచింది. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమిలో తెదేపా చేరడం, కీలకభూమిక పోషిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాని మూడు, నాలుగు మంత్రి పదవులు ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఇందులో మొదటి పేరు రామ్మోహన్‌నాయుడిదే అంటూ ప్రచారం జరుగుతోంది. హిందీ, ఆంగ్లంతో పాటు, తెలుగులోనూ మంచి వక్తగా పేరుంది. గతంలో వాజ్‌పేయీ హయాంలో తండ్రి ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా పనిచేశారు. ఎంపీగా పదేళ్ల రాజకీయ జీవితంలో రామ్మోహన్‌నాయుడు వివాదారహితుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్రం కోసం ఆయన పార్లమెంట్, వెలుపల చేసిన ప్రసంగాలు ప్రజలకు చేరువ చేశాయి. ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలని, రైల్వే జోన్, రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పిన తీరు ప్రజల్ని ఆకట్టుకుంది. జిల్లాలో రాజకీయ ప్రసంగాలకు ప్రజాదరణ గణనీయంగా పెరిగింది. ఆయన హాజరయ్యే సభలు, సమావేశాలకు జనం పోటెత్తడమే నిదర్శనం. పార్లమెంట్‌లోనూ వివిధ సందర్భాల్లో తన వాణిని గట్టిగా వినిపించారు. ఆయనకు ఎన్‌డిఎలో అవకాశం దక్కితే జిల్లాకు ప్రాధాన్యం పెరిగినట్లుగానే భావించాలి.

## రామోజీ మృతికి సినీ ప్రముఖుల దిగ్భ్రాంతి

**రాజమౌళి, కీరవాణి,రాజేంద్రప్రసాద్ తదితరుల నివాళి**


**నేడు చిత్ర పరిశ్రమ బందుకు పిలుపు**

హైదరాబాద్,జూన్8(ప్రజా మంటలు): ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు కన్నుమూసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అక్కడికి తరలివెళ్లి మీడియా సంస్థ అధినేతకు నివాళులర్పిస్తున్నారు. రామోజీ రావు మరణ వార్త సినీ ఇండస్ట్రీని తీవ్రంగా కలచివేసింది. ఈ నేపథ్యంలో రామోజీ మృతి పట్ల సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన మరణానికి సంతాప సూచికంగా ఆదివారం చిత్ర పరిశ్రమకు బంద్ ప్రకటించారు. ఈ మేరకు చలనచిత్ర నిర్మాతల మండలి ప్రకటన విడుదల చేసింది. ఆదివారం అన్ని షూటింగ్‌లూ నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఇదిలావుంటే ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్‌సిటీకి తరలించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్ఎస్ రామజౌళి, ఆయన భార్య రమా రాజమౌళి, కీరవాణి, రాజేంద్ర ప్రసాద్, ఏపీ మాజీ మంత్రి పరిటాల సునీత, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు, బ్యాడ్మింటన్ కోచ్ పు÷–లలెల గోపీచంద్ తదితరులు రామోజీ పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు.

## సంపాదకీయం

# ఫలితాలు కనువిప్పు కావాలి !

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ముగిసి..కొత్త ప్రభుత్వాలు ఏర్పడుతున్న తరుణంలో ఫలితాలపై విశ్లేషణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు, ఒడిషాలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడబోతున్నాయి. కేంద్రంలోనూ అసలు సిసలు ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడబోతోంది. గుడ్డిలో మెల్లలా ఎన్‌డిఎకు ఒడిషాలో, ఎపిలో ప్రభుత్వాలు ఏర్పాటు చేసే అవకాశం వచ్చింది. అయితే ఈ ఫలితాలు నేతలకు కనువిప్పు కావాలి. ప్రజల అవసరాలు, ఆకాంక్షలను తెలుసుకుని పాలన సాగించాలి. దేశంలో ఉన్న వనరులను సద్వినియోగం చేయడం ద్వారా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చ గలగాలి. అప్పుడే దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయి. ఓ ఏడాది క్రితం కర్నాటకలో, ఆరేడు నెలల క్రితం తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఇవన్నీ కూడా ప్రజలు కోరుకున్న మార్పులే. మనమెంతగా నిజాయితీగా ఉన్నామని చాటుకున్నా..ప్రజల ముందు వేషాలు వేయడం కుదరదని ఓటు ద్వారా చెప్పారు. ప్రధానంగా గత ఆరేడునెలల క్రితం తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం ఘోరంగా ఓడింది. ఉద్యమపార్టీగా వచ్చిన టిఆర్‌ఎస్ ఫక్తు రాజకీయం మాత్రమే వంట బట్టించుకుని, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించింది. అప్పులను చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసింది. దీనికి సంబంధించిన ప్రజల్లో వస్తున్న ఆందోళనలను ఎప్పుడూ పట్టించుకోలేదు. ప్రజలను అణచివేసి, రాజకీయ పార్టీలను తొక్కి అధికారం నిలబెట్టుకోవాలనుకున్న కల్వకుంట్ల వారి కలల కల్లలు అయ్యాయి. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మరింతగా బొందపెట్టారు. లేద్దామన్నా లేవకుండా పాతిపెట్టారు. ఇప్పటికిప్పుడు ఎన్ని వేషాలు వేసినా బిఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితి మాత్రం లేదనే చెప్పాలి. అలాగే ఎపిలో కూడా జగన్ అంతకుమించి అన్నట్లు నిరంకుశంగా వ్యవహరించారు. తను మాత్రమే అధికారంలో ఉంటే చాలనుకుని విపక్ష నేతలపై కేసులు, దాడులతో నిరంకుశంగా పాలించారు. ప్రజల స్వేచ్ఛను హరించారు. అభివృద్ధి అంటే ప్రజల ఖాతాల్లో డబ్బులు వేయడమే అన్న సూక్తిని ఒంటబట్టించుకున్నారు. అందుకోసం విపరీతంగా అప్పులు చేశారు. ఈ క్రమంలో జగన్ పాలనపై వస్తున్న హెచ్చరికలను పట్టించుకోలేదు. సరికదా తాను అవ్వాతాతలు, అక్కచెల్లెళ్లు అందరికీ పంచి పెట్టాను ..అయినా ఓట్లేయలేదని వాపోయారు. పాలన అంటే పంచిపెట్టడం అనుకున్నారు. నిజానికి ప్రజలతో సంబంధం లేకుండా నిరంకుశంగా పాలన చేస్తే పరిణామాలు ఇలాగే ఉంటాయని కర్నాటక, తరవాత తెలంగాణ, ఇప్పుడు ఆంధ్రా, ఒడిషాలు నిరూపించాయి. అలాగే కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కూడా ఇదో హెచ్చరిక కావాలి. కానీ ఆయన ఆత్మవిమర్శ చేసుకోలేదని, ఎన్‌డిఎ సమావేశంలో చేసిన ప్రసంగాన్ని బట్టి అర్థం అవుతుంది. ప్రజలను దూరంగా పెట్టి పాలిద్దామనుకునే వారికి ప్రజల్లో అంతగా ఆదరణ ఉండదని తాజా ఫలితాలు తెలియ చేస్తున్నాయి. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలను అంటిపెట్టుకుని వారిని కేంద్రంగా చేసుకుని అభివృద్ధి పనులు సాగించాలి. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసి, సగం వెనకేసుకుని అభివృద్ధి చేసామంటే ప్రజలు నమ్మరని గుర్తించాలి. రాజ్యాంగేతర శక్తుల్లా మారి అధికారం చెలాయిస్తే ఎలా ఉంటుందో ఇటీవల మూడు ప్రభుత్వాల పతనాలు నిరూపించాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్ రెడ్డి పతనం వెనుక అధికారులే కీలక పాత్ర వహించారని, వారు సిఎంఒ కార్యాలయంలో రాజ్యాంగేతర శక్తులుగా మారి మంత్రులు, ఎంఎల్‌ఎలకు, ప్రజలకు సిఎంను దూరం చేశారని కొందరు వైసిపి నేతలే ఇప్పుడు జ్ఞానోదయం పొంది వ్యాఖ్యానిస్తున్నారు. కానీ ఇది వినడానికి అతికినట్లుగా లేదు. ఎందుకంటే నాయకుడు అన్నవాడికి ప్రజలతో నిత్య సంబంధం అవసరం. కాన్వాయ్ కార్లలో తిరుగుతూ, విమానాల్లో చక్కర్లు కొడితే కెసిఆర్ అయినా, జగన్ అయినా నేలకు దిగాల్సిందే. ప్రజల పవర్ ఏంటో తెలుసుకోవా ల్సిందే. ఈ ఇద్దరు నేతలు అహంకారమే అలంకరణగా పాలన సాగించారు. ప్రజలు అనేవారిని పురుగుల్లా చూశారు. చట్టాలను చట్టుబండలు చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా ఏలారు. ఒడిషాలో సిఎం అవినీతి పరుడు కాకున్నా ప్రజలతో నేరుగా సంబంధాలు లేవు. అందుకే అక్కడ బిజెపి పాగా వేయగలిగింది. సిఎం జగన్ మోహన్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఏమి జరుగుతుందో, ప్రజల నిజ సమస్యలేమిటో తెలియకుండా పోయింది. సిఎంలో అధికారులపై ఆధారపడి, క్షేత్రస్థాయిలో ప్రజలు పట్టించుకోక పోతే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ప్రజలను కలవాల్సిన అసవరం సిఎంకు ఏముందని గతంలో కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను గమనిస్తే ఆయన స్థాయి ఏమిటో ప్రజలకు అర్థం అయ్యింది. అందుకే ప్రజలు కర్రును ఎర్రగా కాల్చి మళ్లీ కోరుకోకుండా వాతలు పెట్టారు. ఇప్పుడా వాతలను మాన్పించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఆ రాష్ట్రంతో పాటు ఒడిశాలో అధికారం కోల్పోయిన నవీన్ పట్నాయక్, తెలంగాణలో పదవిని చేజార్చుకున్న కెసిఆర్ లకు కూడా ఇవి వర్తిస్తాయి. అధికారంలో ఉన్నప్పుడు బ్యూరోక్రాట్ల పాలనకు అవకాశం ఇవ్వరాదు. ప్రజాప్రతినిధులుగా ఉన్న మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలకు మధ్య వారధిలా సిఎం అనేవాడు ఉండాలి. అప్పుడే ప్రజాక్షేత్రంలోని అసలు సమస్యలు, పాలనలో మంచి చెడులు అధినేత దృష్టికి వస్తాయి. తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం కల్పించుకోవాలి. ఒడిశాలో 24 ఏళ్ళుగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలన సాగించిన నవీన్ పట్నాయక్ పదవీచ్యుతుడు కావడానికి కూడా అక్కడ ప్రైవేటు సెక్రటరీగా పని చేసిన వికె పాండ్యన్ కారణమని రాజకీయ, అధికార వర్గాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రచారం జరుగుతున్నది. వికె పాండ్యన్ గడిచిన కొన్ని సంవత్సరాలుగా సూపర్ సిఎంగా వ్యవహరించారని, పరిపాలనలో సిఎంకు, ఇతర ప్రజా ప్రతినిధులకు మధ్య గ్యాప్ పెంచారని అక్కడ ప్రస్తుతం విజయ దుందుభి మోగించిన బిజెపి వర్గాలు ఎన్నికల్లో దీన్నే ప్రధాన ప్రచార అస్త్రంగా వాడుకున్నాయని అంటున్నారు. మొత్తంగా కార్యదర్శులకు పెత్తనం ఇస్తే ఇలాగే జరుగుతుంది. సిఎ అంటే అధికారం చెలాయించే నియంత కాదని గుర్తించాలి. ప్రజలకు తాను ప్రతినిధిని అని గుర్తించాలి. ప్రజల కోసం పనిచేసే సేవకుడిని అనే స్పృహలో ఉండాలి. అప్పుడే..పాలన సజావుగా సాగుతుంది. ప్రజలు కూడా నిరంతరాయంగా అలాంటి పాలకులను ఆదరిస్తారు.



# రామోజీ ఓ ధృవతార

హైదరాబాద్,జూన్8 (ప్రజామంటలు):



మీడియా దిగ్గజం రామోజీరావు మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేసారు. రామోజీ ఫలిం సిటీకి చేరుకుని భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. అఖండమైన తెలుగు జ్యోతి ఆరిపోయిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఆయన రామోజీ ఫిలిం సిటీకి వెళ్లి రామోజీ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. రామోజీ రావు వ్యక్తి కాదని, శక్తివంతమైన వ్యవస్థ అని పేర్కొన్నారు. జీవితంలో స్వయంకృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించి మనకు దూరమయ్యారని తెలిపారు. ఓ ధృవతారగా వెలుగుతూ ఉంటారని... ఆయన చేతలు, రాతలు, చేపట్టిన కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని భావిస్తున్నానని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. పత్రిక పెట్టిన నాటి నుంచి వారితో ఎంతో సన్నిహితంగా ఉండేవాడినని.. ఆయనతో వివిధ సందర్భాల్లో చర్చించటం వల్ల పరిపక్వత చెందానని తాను భావిస్తానని వెంకయ్య నాయుడు తెలిపారు. వారు పోరాట యోధులని.. జీవితంలో మరింత కాలం పోరాడతారని భావించానన్నారు. విజయం సాధించినప్పటికీ, ఇంత త్వరగా వారు పోరాటాన్ని ముగిస్తారని అనుకోలేదన్నారు. తన కుటుంబ సభ్యులను అభిమానించే వారని పేర్కొన్నారు. మా కుటుంబం తరుపున రామోజీరావు స్మృతికి నివాళులు అర్పిస్తున్నానన్నారు. వారి కుటుంబ సభ్యులందరికీ తన తరుపున, తన కుటుంబ సభ్యుల తరుపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని రామోజీ తెలిపారు. ఈనాడు, ఉషాకిరణ్ సంస్థల అధిపతి రామోజీరావు అస్తమయం పట్ల భారత ప్రధాన మాజీ న్యాయమూర్తి , జస్టిస్ ఎన్‌వీ రమణ దిగ్భాం÷–రతి వ్యక్తం చేశారు. రామోజీరావు ప్రజాస్వామ్య పరి రక్షణ కోసం, ప్రజల కోసం అలుపెరుగని యోధుడిలా పనిచేసిన పోరాట యోధుడని కొనియాడారు.నేడు ప్రజాస్వామ్య విజయాన్ని చూసి, ఆనందించి, స్వర్గస్తులయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ప్రజా జీవితంలో రామోజీ వ్యవస్థలు భాగస్వామ్యమయ్యాయని వెల్లడించారు. ఆయన మరణం విచారకరమని అన్నారు. ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మరణం పట్ల భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర సంతాపం తెలిపారు.÷ామోజీరావు మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం వ్యక్తం చేశారు. పాత్రికేయ రంగంలో రామోజీరావు చెరగని ముద్ర వేశారని దత్తాత్రేయ అన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడటానికి విశేష కృషి చేశారని, ఆ రంగంలో నూతన ఒరవడి సృష్టించారని కొనియాడారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రామోజీ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. రామోజీరావు మరణం తీవ్ర విషాదానికి గురిచేసిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మీడియా రంగానికి రామోజీరావు చేసిన సేవలు అమూల్యమని కొనియాడారు. రామోజీరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.



## కవిత్వం

### వానలు పడాలే

దండిగా వానలు పడాలే
ధరణి మురవాలే
వానలు పడాలే
వాగు వంకలు నిండాలే!!

పచ్చని పైరు పంటలు
పండాలే
చెరువులు నిండాలే
చేపలు దండిగా ఉండాలే
బావులు నిండాలే
బాగా పంటలు పండాలే!!

కర్షకుని కష్టాలు తీరాలే
కర్షకుడు కడుపు నిండా
తినాలే
ధరణిలో దండిగా పంటలు
పండాలే
అవనిలో అందరూ
మురవాలే!!

పల్లెలు పచ్చగా ఉండాలే
పశువుల గాసం దొరకాలే
బాగా వానలు పడాలే
బంగారు పంటలు పండాలి
వానతో వ్యవసాయం
ముందుకు సాగాలి
ధరణిలో జనమంతా
సంతోషంగా
ఉండాలే !!

దేవులపల్లి రమేశ్
నంగునూర్, సిద్దిపేట జిల్లా
9963701294.

# మీడియా రంగానికి రామోజీ ఎనలేని సేవలు

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన జగన్, షర్మిల

అమరావతి జూన్8 (ప్రజామంటలు):





రామోజీ రావు మృతి వార్త తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని ఆంధ్రప్రదేశ్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. తెలుగు మీడియా రంగానికి రామోజీ రావు ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ప్రకటించారు. రామోజీ రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామోజీరావు మృతిపై ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంతాపం వ్యక్తం చేశారు. 'అక్షర యోధులు, వివిధ రంగాలలో అద్భుతమైన విజయాలు సాధించారు. భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచి విశిష్టమైన వ్యక్తిగా నిలిచారు. రామోజీ రావు మరణం అత్యంత విషాదకరం. రామోజీరావు కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి అని' వైఎస్ షర్మిల సంతాపం తెలిపారు.మరోవైపు రామోజీరావు అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. సినీ పరిశ్రమ బాగుకోసం రామోజీ రావు తపించారు. రామోజీ మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. రామోజీ మృతికి గౌరవసూచకంగా ఆదివారం తెలుగు చిత్ర పరిశ్రమ బంద్‌కు చలనచిత్ర నిర్మాతల మండలి పిలుపునిచ్చింది.

# అసాధారణ వ్యక్తి రామోజీరావు

# రామోజీ మృతి పట్ల కెసిఆర్ దిగ్భ్రాంతి

### పత్రికా రంగంలో రామోజీ సేవలు అమోఘం

### నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్

### భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన కెటిఆర్ తదితరులు

హైదరాబాద్,జూన్8 (ప్రజామంటలు):



ప్రముఖ మీడియా నిపుణులు, రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీ రావు(87 మృతి పట్ల తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటు రామోజీ కుంటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నేత, మాజీ ఆర్థిక మంత్రి హరీశ్ రావు కూడా రామోజీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. పత్రికా, టీవీ, సినిమా రంగాల్లో రామోజీ సేవలతో ఎంతో మందికి ఉపాధి లభించిందని గుర్తు చేశారు. దీంతోపాటు రామోజీ శ్రమ, తపన, నిబద్ధత, క్రమ శిక్షణ కల్గిన మంచి వ్యక్తి అని హరీశ్ రావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నేత, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ కూడా రామోజీ మృతి పట్ల సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. రామోజీ గారి మరణం గురించి తెలుసుకుని చాలా బాధపడ్డానని ఆయన నిజమైన దార్శనికుడని అభివర్ణించారు. ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఎన్నో అసమానతలు ఉన్నప్పటికీ గొప్ప విజయాన్ని ఎలా సాధించవచ్చో ఆయన జీవితం, ప్రయాణం చూస్తే అర్థమవుతుందన్నారు. ఈ క్రమంలో తెలుగు మీడియా, వినోద ప్రపంచంలో ఆయన చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. గత దశాబ్దంలో నేను చాలాసార్లు సంభాషించే అవకాశాన్ని పొందానని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు నా హృదయపూర్వక సానుభూతి తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో రామోజీ రావు పార్థివదేహానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలుగు పత్రికా రంగంతో పాటు తెలుగు ప్రసార మాధ్యమాల్లో ఒక విప్లవాత్మకమైన మార్పుకు రామోజీ రావు బీజం వేశారు. ఈనాడు పత్రిక స్థాపించిన తర్వాత, ఈటీవీ ద్వారా ఎల్టానిక్ మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రొఫెషనిలజంతో, విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీ రావు గుర్తుగా నిలిచిపోతారు. తెలుగు భాషాభివృద్ధి కోసం ఆయన ఎంతో తపన పడ్డారు. దేశం, రాష్ట్రం బాగుండాలని కోరుకునేవారు. తెలుగు ప్రజలు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల గురించి గొప్పగా మాట్లాడేవారు. ఎన్నో సందర్భాల్లో ఇదే ఫిలిం సిటీలో వారిని కలుసుకునే అవకాశం తనకు లభించింది. మొబైల్ ఎన్‌సైక్లోపీడియా లాగా అన్ని విషయాలు చెప్పేవారు. రామోజీ మృతి తెలుగు పత్రికా రంగానికే కాకుండా ప్రపంచంలోని తెలుగు వారంరదికీ తీరని లోటు అని పేర్కొన్నారు. యూనివర్సల్ స్టూడియో స్థాయిలో రామోజీ ఫిలిం సిటీని నిర్మించాలన్న విజన్ రామోజీ రావుకే ఉండే. ఆయన ఆలోచనలు, జ్ఞాపకాలు తప్పకుండా భవిష్యత్‌లో అందరికీ స్ఫూర్తిని ఇస్తాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఎప్పటికీ తెలుగు జాతి ఆయనను గుర్తు పెట్టుకుంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకులు రామోజీ రావు మృతి చాలా బాధాకరం అని బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఇదీ సంగతి, నమ్మలేని నిజాలు, ఇది కథ కాదు, ఫాంటమ్ లాంటి విలక్షణీయ ఫీచర్స్‌తో ఈనాడు పత్రికను రామోజీ రావు నడిపిన తీరు అమోఘం. పత్రికలను చదివే అలవాటు ఈనాడు నుండే వచ్చింది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా అని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.



# విద్యావేత్త చుక్కా రామయ్య సంతాపం

హైదరాబాద్,జూన్8 (ప్రజామంటలు):



ఈనాడు సంస్థల గ్రూపు చైర్మన్ రామోజీ రావు మృతిపట్ల విద్యావేత్త చుక్కా రామయ్య సంతాపం ప్రకటించారు. అసాధారణ వ్యక్తి రామోజీరావు అని పేర్కొన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు అస్తమయం తెలుగువారికి అశనిపాతం. దాదాపు ఆరు శతాబ్దాలకు పైగా తెలుగువారి జీవితాలతో పెనవేసుకుపోయిన ఆయన విశిష్ఠ వ్యక్తిత్వ పోరాట స్ఫూర్తికి నిదర్శనం అని పేర్కొన్నారు.పత్రిక, వ్యాపార, సినిమా, టీవీ, డిజిటల్ రంగాల్లో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. రామోజీ రావు అస్తమయం తెలుగు ప్రజలకు తీరని లోటు. అసాధారణ వ్యక్తి రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని చుక్కా రామయ్య పేర్కొన్నారు. రామోజీ రావు మృతిపట్ల ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం సంతాపం ప్రకటించారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు తెలుగు జాతికి గర్వంగా నిలుస్తాయని అనిల్ పేర్కొన్నారు. నిర్మాతగా టాలీవుడ్‌లో ఎన్నో మరపురాని సినిమాలను నిర్మించారని గుర్తు చేశారు. తెలుగు, బెంగాలీ, హిందీ, కన్నడ, తమిళ భాషల్లో పలు సూపర్ హిట్ సినిమాలను నిర్మించారు. రామోజీరావు భారతీయ చలనచిత్ర రంగాన్ని నూతన శిఖరాలకు చేర్చారని కొనియాడారు. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా వివిధ భాషల్లో 87 సినిమాలు నిర్మించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ సిటీ నిర్మించి, ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్ ద్వారా ఎంతోమంది నటులు పరిచయమై ఎంతోమంది నటులు, అగ్రశ్రేణి తారలుగా ఎదిగారని అనిల్ పేర్కొన్నారు.

## ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావు మృతి బిసి సంక్షేమ సంఘం నివాళులు



జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు): ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావు గారు కన్నుమూశారు. తెలుగు పత్రికా రంగంలో విప్లవం సృష్టించి, తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావు గారి మృతి పట్ల జగిత్యాల జిల్లా బి సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మినారాయణ తెలంగాణ రాష్ట్ర బి సి సంఘం పక్షాన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసినారు. బి.సి సంఘ సమస్యలను ఎప్పటికప్పుడు వారి వార్తాపత్రిక ద్వారా ప్రజల ముందుంచిన రామోజీరావు అస్తమయం చాలా బాధాకరమైనదని, తెలుగు పత్రికా దిగ్గజం, ఈనాడు గ్రూప్స్ అధినేత, పద్మవిభూషణ్ గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటని అన్నారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావు గారికి దక్కుతుందని ఒక సందేశంలో పేర్కొన్నారు. రామోజీరావు తెలుగువారి కీర్తిని దేశ స్థాయిలో చాటిన వ్యక్తిగా కొనియాడారు. రంగం ఏదైనా విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన వ్యక్తి రామోజీరావు అన్నారు. పత్రికా నిర్వహణ ఒక సవాల్ అనుకునే పరిస్థితుల్లో ఐదు దశాబ్దాల పాటు ఈనాడు పత్రికను నెంబర్ వన్ స్థానంలో నడపడం, ఈటీవీ స్థాపనతో టీవీ మీడియా రంగానికి దశాదిశా చూపిన దార్శనికుడు రామోజీరావు అని అన్నారు. అక్షర వీరుడు రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ... ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, సంయుక్త రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అలిశెట్టి ఈశ్వరయ్య, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, బిసి సంక్షేమ సంఘం యూత్ కో–ఆర్డినేటర్ హృషికేష్, తిరుపురం శ్రవణ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.




జగిత్యాల మండలంలోని జాబితాపూర్ గ్రామం నర్సయ్య హోటల్ లో గ్రామ నాయకులతో కలిసి చాయ్ పై చర్చ. పాల్గొన్న ఎమ్మెల్సీ ఎల్. రమణ వారి వెంట ఉన్న గ్రామ మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు.



జగిత్యాల మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మైలారపు గంగారాం ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ ఎల్ రమణ. వారి వెంట పాల్గొన్న సర్పంచ్ నారాయణ గౌడ్, అంకం సతీష్, ఎంపిటిసి గిద్దే శంకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దయ్యాల మల్లారెడ్డి, మాడిశెట్టి సూర్య ప్రకాష్, గుడిసెల సిద్ధార్థ, బుర్ర శ్రీధర్



జగిత్యాల పట్టణంలోని ఒగ్గు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు ఓల్లెం కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ ఎల్ రమణ. వారి వెంట మాజీ సిగిల్ విండో ఛైర్మెన్ బి. సత్యనారాయణ రావు, వొల్లెం మల్లేశం, దయాల మల్లారెడ్డి, పుల్ల మల్లయ్య, చెట్టే మల్లేశం, చెట్టే రమేష్, మొగుళ్ల పోచమల్లు తదితరులు



జగిత్యాల్ జిల్లా గొల్లపల్లి మండలం చిల్వా కోడూర్ ధర్మారం హైవే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో, బైక్ ఢీ కొని తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్ లో క్షతగాత్రులను హాస్పిటల్ పంపించడం జరిగింది. పూర్తి వివరాలు తెలియల్సి ఉంది.

## నీట్ - 2024 ను తిరిగి నిర్వహించాలని వైద్య విద్యార్థుల డిమాండ్

### రోడ్డుపై బైటాయించి నిరసన



జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు): గత నెలలో నిర్వహించిన నీట్–2024 పరీక్ష ను తిరిగి నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలని కోరుతూ ప్లకార్డులతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారూ మాట్లాడుతూ.... నీట్ చరిత్రలో ఇద్దరు, ముగ్గురు మినహా 60 మందికి పైగా ఆల్ ఇండియా స్థాయిలో మొదటి ర్యాంకు రావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. దేశంలోని ఢిల్లీ, హర్యానా ప్రాంతాల్లో నీట్ పరీక్ష లీక్ అయ్యిందని ఆరోపణలు వచ్చాయాని, ఆరోపణలపై ఎలాంటి చర్యలు లేకపోవడం విచారకరం అన్నారు. నాలుగైదు ఏళ్ళు కోచింగ్ లు తీసుకునే విద్యార్థులకు సైతం ఇన్నేళ్లుగా రాని మొదటి ర్యాంక్ లు ఇప్పుడెలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కటాఫ్, నెగిటివ్ మార్కులకు భిన్నంగా నీట్ ఫలితాలు ఉండడం విచారకరం అన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడే విధంగా నేషనల్ టెస్ట్ ఏజెన్సీ చేపట్టిన నీట్ –2024 పరీక్ష నిర్వహణ పై వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం జ్యుడిషియరి విచారణ జరిపించాలని, నీట్–2024 ను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు డాక్టర్ వినూత్న రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ముద్దం విజయ్, మహేష్ రెడ్డి, బాలాజీ, శివ సాయి రెడ్డి, భాను ప్రకాష్ తదితరులున్నారు.

## ఆర్ఎంపి , పిఎంపి సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం



ఇల్లందకుంట జూన్ 08 (ప్రజామంటలు): గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపి మరియు పిఎంపి సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని. శ్రీ రామ ఆదర్శ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మండల జయ ముర్తి అన్నారు. శనివారం మండల కేంద్రములోని గ్రామీణ వైద్యుల సమావేశం జిల్లా అధికార ప్రతినిధి పైడిపల్లి భీమన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ వైద్యుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులు మండల జయమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పంజాల తిరుపతి, కోశాధికారి గా కోడం శంకర్, గౌరవ అధ్యక్షులుగా సిరికోండ సాంబ మూర్తి, ఉపాధ్యక్షులుగా దోంతుల రాజేశం, కోదండరాం, ప్రచార కార్యదర్శిగా అర్జున్, సంయుక్త కార్యదర్శి గా చిరంజీవి, సహాయ కార్యదర్శిగా సురేష్, ఎథిక్స్ కమిటీ సభ్యులుగా ఎడ్ల సమ్మన్న, అధికార ప్రతినిధి గా సదానందం, గౌరవ సలహాదారులుగా కొత్త శ్రీనివాస్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నుతన అధ్యక్షులు మాట్లాడుతూ.... తన నియమాకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఇంటర్ విద్యార్థులకు ఈనెల 10న సోమవారం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష

జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు):



గత ఫిబ్రవరి నెలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు జరిగిన ఇంటర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలో హాజరుకాని విద్యార్థు లకు ఈనెల 10వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించబడును సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించనప్పటికీ పరీక్షకు హాజరు కావచ్చు ను కావున ఫిబ్రవరి నెలలో జరిగిన పరీక్షలో ఆబ్సెంట్ అయినవారు సోమవారం రోజున పరీక్షకు హాజరు కావచ్చును.

**పర్యావరణ విద్య పరీక్ష ఈనెల 11వ తేదీ మంగళవారం**

గత ఫిబ్రవరి నెలలో నిర్వహించిన పర్యావరణ విద్య పరీక్షకు ఆబ్సెంట్ అయిన విద్యార్థులకు ఈనెల 11వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నము 1:00 గంట మధ్య వీరికి పరీక్ష నిర్వహించబడును.

**ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్ పరీక్ష ఈనెల 12న బుధవారం**

ఎవరేని విద్యార్థులు ఎథిక్స్ , హ్యూమన్ వాల్యూస్ లో ఉత్తీర్ణులు కాని వారు పరీక్ష ఫీజు చెల్లించన ప్పటికిని ఈ పరీక్షకు వారి వారి కళాశాలలో విద్యార్థులు హాజరుకావచ్చును. ఈ మూడు పరీక్షలలో ఉత్తీర్ణులు అయితేనే అయితేనే ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ విడుదల చేయబడుతుంది. కావున విద్యార్థులు పై మూడు పరీక్షలలో పై తేదీలలో హాజరు కావాలని పరీక్షలు కన్వీనర్ ఇంటర్ విద్య నోడల్ అధికారి బి. నారాయణ తెలిపారు.



## త్వరలో ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ కు మోక్షం శాసనమండలి సభ్యులు కూర రఘోత్తము రెడ్డి

జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు): రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ కు మోక్షం లభిస్తుందని దాని ద్వారా మండల విద్యాధికారి పోస్టులు భర్తీ అవుతాయని శాసనమండలి సభ్యులు కూర రఘోత్తము రెడ్డి అన్నారు. పిఆర్టియు–టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాల్ల అమర్నాథ్ రెడ్డి, బోయిని పెల్లి ఆనంద్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ అవార్డుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనమండలి సభ్యులు కూర రగోత్తం రెడ్డి మాట్లాడుతూ%ొ%. ప్రభుత్వం త్వరలోనే అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమిస్తుందని అన్నారు. పీఆర్టి యుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.... పాఠశాలలకు ఉచిత కరెంటు అందజేస్తూ ప్రభుత్వం త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తున్నారని అదేవిధంగా పెండింగ్ బిల్లులు జులై చివరి వారం వరకు ప్రభుత్వం అందిస్తుంది అని అన్నారు చెల్లించని పక్షంలో ఉద్యమం చేయడానికి కూడా వెనకాడమని అన్నారు. ఇప్పుడు జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు పిఆర్టియు కృషి వల్లనే జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు మాట్లాడుతూ పండితులు పోస్టులు అప్ గ్రేడషన్ పి ఆర్ టి యు తోనే సాధ్యమైందనిది అన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మైనార్టీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ %ఒ% మోడల్ స్కూల్ పాఠశాలల 37 మంది విద్యార్థులకు అలాగే 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 101 మంది ప్రధానోపాధ్యాయులను జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ మాసపత్రిక సంపాదక వర్గ సభ్యులు జాలి మహేందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు ముసుకు తిరుపతిరెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కిషన్, పెద్దపెల్లి జిల్లా శాఖ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి సురేష్, కృష్ణమూర్తి మండల విద్యాధికారులు గాయత్రి, జమున, గంగాధర్, భీమయ్య, నరేశం, ఆనందరావు, డి.సి.ఈ.బి. సెక్రెటరీ మురళీ మనోహర్ చారి, సంఘ బాధ్యులు ఏవియన్ రాజు, మహేష్, శ్రీనివాస్ రెడ్డి, జమీల్, దుబ్బయ్య, చంద్ర ప్రకాష్, మల్లారెడ్డి, వాజిద్, జమున, చందన, విద్యదేవి, పద్మ, శ్రీదేవి, వసంత, రాధా లక్ష్మి 18 మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర జిల్లా బాధ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ ను ధర్మపురి లోని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా మున్నూరు కాపు కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రావలసిందిగా ఆహ్వానించిన అధ్యక్షుడిగా ఎన్నికైన వొడ్నాల రాజశేఖర్.

## మల్యాల మండలం పోతారం లో అగ్ని ప్రమాదం

మల్యాల జూన్ 08 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా మల్యాల మండలం పోతారం లో అగ్ని ప్రమాదంలో ఎనుగంటి ప్రశాంత్ అనే రైతు కు చెందిన 1500 గడ్డి కట్టలు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోగా, సమాచారం అందుకున్న జగిత్యాల అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి ఎలాంటి ప్రమాదం సంభవించకుండా మంటలను ఆర్పేశారు. సుమారు పదివేల వరకు నష్టం జరిగిందని తెలిపిన భాదితుడు. ఇందులో ఇన్చార్జ్ ఫైర్ ఆఫీసర్ జి. మధు, ఫైర్ మాన్లు కే. నరేష్ , ఎం. వేణు, జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తేలు దేవన్న మృతి, నివాళులర్పించిన జువ్వాడి కృష్ణారావు

ఇబ్రహీంపట్నం జూన్ 08 (ప్రజామంటలు): కోరుట్ల నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో తేలు దేవన్న శనివారం మరణించగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు డబ్బా గ్రామంలోని మృతుని ఇంటికి వెళ్లి మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. జువ్వడి కృష్ణారావు వెంట మెట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తీపి రెడ్డి అంజిరెడ్డి, జెట్టి లింగం, ఎల్లాల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శంకర్, జాన్, తేలు రమేష్, జీవన్, నరసయ్య, రాజేష్, తదితరులు ఉన్నారు.



## రామోజీ రావు మృతి పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దిగ్భ్రాంతి



హైదారాబాద్ జూన్ 08 (ప్రజామంటలు):
ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రామోజీ రావు మృతి చెందడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జీ డాక్టర్ జీ చిన్నారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పత్రికా, సినిమా, పర్యాటక రంగాలకు ఎనలేని సేవలను అందించిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రామోజీరావు మృతి యావత్ దేశానికి తీరని లోటు అని, వారి కుటుంబ సభ్యులకు చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు.

## పి ఏ సి ఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం..

-ప్రారంభించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి..
-రైతులకు సేవ చేయడంలో సొసైటీలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి..
-ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఓపెన్..
-తీరనున్న వాహనదారుల కష్టాలు..



జమ్మికుంట (ప్రజా మంటలు ):
రైతులకు,వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్,డీజిల్ అందించడంలో సొసైటీలు ఉపయోగపడతాయని హుజురాబాద్ ఎంఎల్ఏ కౌశిక్ రెడ్డి అన్నారు.జమ్మికుంట మండల పరిధిలోని జగ్గయ్యపల్లి గ్రామములో నూతనంగా పెట్రోల్ బంక్ ను ఆయన ప్రారంభించారు.పెట్రోల్ బంక్ తో పాటు ఏటీఎం, ఆయిల్ చేంజ్ 24 గంటల పాటు అందుబాటులోకి తీసుకువచ్చామని,రైతులు వాహనదారుల దీన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం సొసైటీ చైర్మెన్ పొనగంటి సంపత్ మాట్లాడుతూ 2108 లో డీజిల్ బంక్ గా ఏర్పడ్డ ఈ బంక్ అనతికాలంలోనే నాణ్యమైన డీజిల్ అందించి ప్రజల మన్ననలను పొందిందని, రైతులు, వాహనదారులు, ఈ ప్రాంత ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు పెట్రోల్ బంక్ ను కూడా ప్రారంభించుకున్నామని, దీనికి సంఘం సభ్యులు, ప్రజలు సహకరించారని అన్నారు. సొసైటీ పరిధిలోని ఏడు గ్రామాల ప్రజల సహకారం మరువలేనిదని అందరి సహకారంతో ప్రారంభమైన ఈ బంక్ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, సొసైటీ సీఈఓ రవి, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, సొసైటీ మాజీ సీఈవో ప్రకాష్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్, వరంగల్ కోపరేటివ్ మోటివేటర్ పొనగంటి రాజయ్య, నాయకులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# గాంధీ ఆసుపత్రిలో మత్తు పదార్థాల కలకలం

### సెక్యూరిటీ తనిఖీల్లో కల్లు ప్యాకెట్ల పట్టివేత



సికింద్రాబాద్ జూన్ 08 (ప్రజామంటలు):
గాంధీ ఆసుపత్రిలో కల్లు, గుట్కా, సిగరేట్లు, మద్యం వంటి మత్తు పదార్థాలు కలకలం రేపుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పేషంట్లు ట్రీట్మెంట్ కోసం గాంధీకి వస్తుండగా, కొందరు రోగుల సహాయకులు పలు రకాల నిషేదిత మత్తు పదార్థాలను గాంధీ ఆసుపత్రిలోనికి తీసుకువస్తున్నారు. పలు వ్యసనాలకు బానిసలైన వీరు ఆసుపత్రి బయట నుంచి తెల్లకల్లు, గుట్కా, సిగరేట్లు, గంజాయి, లిక్కర్ లాంటి మత్తు పదార్థాలను కొనుగోలు చేసి, ఆసుపత్రిలోనికి తీసుకువస్తుండగా, ఇటీవల సెక్యూరిటీ తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం ఆసుపత్రి వార్డులోనికి ఓ పేషంట్ కు సంబందించిన మహిళా సహాయకురాలును సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయగా, కల్లు ప్యాకెట్లు బయట పడ్డాయని సెక్యూరిటీ చీఫ్ శివాజీ తెలిపారు. ఆసుపత్రిలోనికి మత్తు పదార్థాలను తీసుకురావద్దని పేషంట్ల సహాయకులకు ఎన్నిసార్లు చెప్పిన వారు తమ పద్దతి మార్చుకోవడం లేదని సెక్యూరిటీ సిబ్బంది వాపోతున్నారు. ఆసుపత్రిలోనికి మత్తు పదార్థాలకు అనుమతి లేదని, ఎవరైన తీసుకువస్తే, చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజారావు హెచ్చరించారు.

## ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని ఎమ్మెల్యే సంజయ్ ను కోరిన మున్నూరు కాపు సంఘ నేతలు

జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు):
ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జగిత్యాల జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, నాయకులు. జూన్ 9 ఆదివారం బి ఎల్ ఎన్ గార్డెన్స్ లో మున్నూరు కాపు జిల్లా సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరు కావాలని సంఘం సభ్యులు, నాయకులు తెలిపారు.



# తెలంగాణ ద్రోహి కౌశిక్ రెడ్డి

పొన్నం ప్రభాకర్ ను విమర్శించే స్థాయి నీది కాదు

ఆయన కాళ్ళ కున్న సిరి నీ ముఖానికి లేదు

దేశిని కోటి, ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్



జమ్మికుంట జూన్ 08 (ప్రజామంటలు):
హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ఎన్టిపిసి నుండి వస్తున్న బూడిద లారీలను హుజురాబాద్ లో ఆపి ఓవర్ లోడుతో నడుస్తున్నాయని, 32 టన్నుల కంటే అధిక లోడ్ చేసి నడుపుతున్నారని, గౌరవ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ముడుపులు ముడుతున్నాయని ఆరోపించారు. ఈ బూడిద లారీలు, ఇసుక లారీలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే నడుస్తున్నాయా, గతంలో కూడా నడిచాయా ఒకసారి ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో మానేరు వాగు నుండి ఇసుకను ఇష్టానుసారంగా అధిక లోడులతో తీసుకెళ్లారని, అప్పుడు ఈ ప్రాంతంలోని వావిలాల, తనుగుల, గంద్రపల్లి, శాయంపేట, ధర్మారం, కొత్తపల్లితో పాటు హుజురాబాద్ నియోజకవర్గం రోడ్లు మొత్తం ధ్వంసం అయ్యాయని తెలిపారు. రోడ్లు చిద్రంగా మారి, అస్తవ్యస్తంగా తయారు కావడానికి కారణం అధికలోడు రవాణ కాదా అని ప్రశ్నించారు. ఆ సమయంలో కౌశిక్ రెడ్డి ఏమయ్యారు..? అప్పుడు ఎందుకు ఆరోపించలేదు..? ఇప్పుడు ఎందుకు ఆరోపిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బూడిద లారీల యజమాన్యం దగ్గర్నుండి పైసల్ వసూలు చేయడం కోసమే ఎమ్మెల్యే లారీలు ఆపుతున్నాడనంలో సందేహం లేదన్నారు. పోన్నం ప్రభాకర్ అన్నను మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలని సిగ్గు లేకుండా మాట్లాడుతున్నావు, పోన్నం ప్రభాకర్ అన్నను కాదు. ఈ తెలంగాణ రాష్ట్రం నుండి కౌశిక్ రెడ్డిని భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ద్రోహి, తెలంగాణ ప్రజలపై తెలంగాణ విద్యార్థులపై రాళ్ళు రువ్విన గుండా పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలు కష్టపడి పార్లమెంటులో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా, తెలంగాణ రాష్ట్రం తెచ్చిన వీరుడు పోన్నం ప్రభాకర్ అన్న అని కొనియాడారు. పొన్నం ప్రభాకర్ అన్నకు, నీకు నక్కకు నాగలోకంకు ఉన్నంత తేడా ఉందన్నారు. ఆయన కాళ్ళ కున్న సిరి నీ ముఖానికి లేదని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇంకోసారి పోన్నం ప్రభాకర్ అన్నపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే నిన్ను ఈ హుజురాబాద్లో తిరగనియ్యమని హెచ్చరించారు.

## గ్రూపు-1 అభ్యర్థులకు తగినన్ని బస్సుల ఏర్పాటు

### జగిత్యాల డిపో మేనేజర్ సునీత



జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో గ్రూప్ -1 నేడు పరీక్ష వ్రాసే అభ్యర్థులందరికీ ఆర్టీసీ బస్సు సేవలు అందిస్తామని జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత తెలిపారు. ఆదివారం పరీక్ష వ్రాసే అభ్యర్థులు తమ తమ గ్రామాల నుండి జగిత్యాల చేరుకునేందుకు టీజీఎస్ ఆర్టిసి జగిత్యాల డిపో పక్షాన తగినన్ని బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధర్మారం, ధర్మపురి, రాయికల్, కడెం, జన్నారం, పెగడపల్లి, కరీంనగర్ రూట్లలో బస్సులను నడపనున్నట్లు డిఎం వివరించారు. అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని సునీత కోరారు.

## కంకర రోడ్డు తో ప్రయాణికులకు ప్రమాదాలు పట్టించుకోని అధికారులు



వేలేర్ జూన్ 08 (ప్రజామంటలు):
వేలేరు మండల కేంద్రంలోని మండల ఆఫీసు నుంచి బంగ్లా పెల్లి వరకు 2 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులు ప్రారంభించి కొన్ని నెలలు గడుస్తున్న ఇంకా బీటీ రోడ్డు పనులు పూర్తి కాలేదు. దీనివల్ల రైతులు ప్రయాణికులు కంకర రోడ్డు పై జారిపడి గాయాలు అవుతున్నాయని జిల్లా అధికారులు పట్టించుకోని పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వేలేర్ మండలంలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయని గతంలో వేలేర్ ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి ఆరోపించారు. కానీ ఇంతవరకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుపోవడం గమనార్హం.

## ఈనాడు అధినేత రామోజీరావు మరణం

### పత్రికా రంగానికి తీరని లోటు

#### తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఇ. చంద్రశేఖర్



సికింద్రాబాద్ జూన్ 08 (ప్రజామంటలు):
ఈనాడు అధినేత రామోజీరావు మరణం మీడియా రంగానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఇ. చంద్రశేఖర్ పేర్కొన్నారు. రామోజీరావు మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు గడ్డ పై ఈనాడు పత్రికను ప్రారంభించి మీడియా రంగంలో రామోజీరావు సంచలనం సృష్టించారన్నారు. పత్రిక ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ తో పాటు అనేక కథనాలతో సమాజంలోని అనేక రుగ్మతలు, అవినీతి, అక్రమాలపై అక్షర సమరం సాగించిన అక్షర యోధుడు రామోజీరావు అని కొనియాడారు. పత్రికా రంగంలో ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచి..ఈనాడు ద్వారా నిష్ణాతులైన జర్నలిస్టు లను తయారు చేసి సమాజానికి అందించిన ఘనత రామోజీరావు కు దక్కుతుందన్నారు. అక్షరమే ఆయుధంగా...కలమే బలంగా ముందుకు సాగిన ధీశాలి రామోజీరావు అని పేర్కొన్నారు. నాడు ఈనాడు, ఈ టివి రిపోర్టర్ గా పని చేసి జర్నలిజం లో అనేక విషయాలు తెలుసుకొని సమాజపురోవృద్ధికి పునరంకితమై...తనవంతు బాధ్యతగా ముందుకు సాగినట్లు గుర్తు చేసుకున్నారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు.

## భీంరాజ్ పల్లి లో బొడ్రాయి పండుగ వేడుకలు



గొల్లపల్లి జూన్ 08 (ప్రజామంటలు):
మండలంలోని భీంరాజ్ పల్లి గ్రామంలో బొడ్రాయి (ఎలా నంపే) పండుగ వేడుకలు శనివారం రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. దావతు పూజారి కునమల్ల తిరుపతి, పది మంది పూజార్ల



బృందం ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుల మధ్య ఉదయం పోచమ్మ గుడి వద్దకు ఊరేగింపుగా తరలి వెళ్లిమొదటి ముడుపు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ శివారులోని నాలుగు దిక్కుల పొలిమేర చుట్టూ ముడుపు కట్టారు. ప్రతి ఇంటికి తిరుగుతూ చల్లపరిచారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు బొడ్రాయి వద్ద పట్నం వేసి బొమ్మల కొలువు చేపట్టి కథ చెప్పారు. రాత్రి ఊరు పొలిమేర చుట్టూ సరువు పరిచారు. గ్రామస్తులు సాంప్రదాయ రీతిలో తరలి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎం.ఎస్.పి. హుస్నాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం



ఎల్కతుర్తి జూన్ 08 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండలంలోకవాతుకు సిద్ధమవుదాం ఎం ఎస్పీ జాతీయ నాయకులు పుట్ట రవి మాదిగ హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ ఎల్కతుర్తి మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకులు పుట్ట రవి మాదిగ హాజరై మాట్లాడుతూ మాదిగ దండోరా ఉద్యమం వచ్చే నెల జూలై 7తో 30 సంవత్సరాలు పూర్తి చేసుకుని సందర్భంగా మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం వరంగల్లో నిర్వహించ తలపెట్టిన కవాతుకు సిద్ధం కావాలని ప్రతి గ్రామం నుండి మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని కవాతును విజయవంతం చేయాలని కోరారు మండలంలో ఉన్న ముఖ్య కార్యకర్తలతో కీలకమైన సూచనలు చేశారు ప్రతి గ్రామంలో మాదిగ దండోరా మహాజన సోషలిస్ట్ ఉద్యమ దండోరా జండా గద్దెల నిర్మించాలన్నారు ప్రతి ఒక్క కార్యకర్త వచ్చే నెల 6 వరకు ప్రతి గ్రామంలో మాదిగలను చైతన్య పరచాలని దండోరా ఉద్యమానికి ఉన్న విలువలను చాటి చెబుతూ మంద కృష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితాలను వివరిస్తూ జాతిని సమైక్యపరచాలని మాదిగ దండోరా ఉద్యమానికి సంబంధించిన కోడు బ్లాక్ పాయింటు వైట్ షర్టు నల్ల కండువా ధరించాలని సూచించారు కవాతు విజయవంతం చేయుటకు ఈనెల 13 నుండి మండలంలోని అన్ని గ్రామాలలో తన పర్యటనలు ఉంటాయని తెలియజేస్తూ మండలంలోని గ్రామాలను ప్రభావితం చేస్తూ రాష్ట్రంలోనే ఎల్కతుర్తి మండలం ను విజయపథంలో నడిపిస్తానని బలమైన ఉద్యమాన్ని నిర్మించి రాష్ట్రంలోనే ఎల్కతుర్తి మండలాన్ని ముందు వరుసలో నిలబెడతానని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజారపు బిక్షపతి, అంబాల రవీందర్, అంబాల బాబు, మేకల రవీందర్, అంబాల సంపత్, శనిగరపు సుమన్, అంబాల సంపత్, అంబాల సుమన్, మున్నా పాల్గొన్నారు

## అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించిన

### మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్






జగిత్యాల జూన్ 08 (ప్రజామంటలు):
అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించిన జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా ఆధునిక హంగులతో ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫార్మ్ అలాగే ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం తరగతి గదుల మైనర్ అండ్ మేజర్ మరమ్మత్తులు నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడం బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం ప్రతి తరగతి గదికి విద్యుత్ సౌకర్యం కల్పన వంటి మౌలిక వసతులు అమ్మ ఆదర్శ పాఠశాలనే కార్యక్రమం ద్వారా చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పనులు వేగవంతం అధికారులను ఆదేశించిన జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. ఈ కార్యక్రమంలో బీరం రాజేష్ సుధీర్ కూతురు శేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.




# స్మార్ట్ టీవీల సరఫరాలు తగ్గాయ్

### జనవరి-మార్చిపై కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక

దిల్లీ: కంపెనీల నుంచి స్మార్ట్ టీవీల సరఫరాలు, గతేడాది ఇదే సమయంతో పోలిస్తే, ఈ ఏడాది జనవరి-మార్చిలో 14% తగ్గాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది.
వినియోగదారు గిరాకీ స్తబ్దుగా ఉండటంతో పాటు.. ఇప్పటికే డీలర్ల వద్ద నిల్వలు అధికంగా ఉండటమే ఇందుకు కారణమని పేర్కొంది. ఈ క్యాలెండర్ ఏడాదిలో టీవీల సరఫరాల్లో 10% క్షీణత నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. సమీక్షా త్రైమాసికంలో చైనా కంపెనీ షియోమీని తోసిరాజని, శామ్‌సంగ్ మళ్లీ అగ్ర స్థానానికి చేరింది.
చైనా బ్రాండ్ల స్మార్ట్ టీవీల సరఫరాలు 30% క్షీణించడం గమనార్హం. వన్‌ప్లస్, హైయర్, రియల్‌మీ బ్రాండ్ల స్మార్ట్ టీవీలు బాగా తగ్గాయని నివేదిక తెలిపింది. శామ్‌సంగ్ సరఫరాలు 40% పెరిగాయి. భారతీయ కంపెనీల స్మార్ట్ టీవీల సరఫరాలు 16 శాతంగా ఉన్నాయి. దక్షిణ కొరియా కంపెనీ ఎల్‌జీ సరఫరాలు 43% పెరిగాయి. మన దేశంలో స్మార్ట్ టీవీ విపణిలో ఎల్‌జీకి 15% మార్కెట్ వాటా ఉంది. చైనా బ్రాండ్లు ఎంఐ, టీసీఎల్ కంపెనీల సరఫరాలు వరుసగా 2%, 4% క్షీణత నమోదు చేశాయి. మన విపణిలో వీటి వాటా వరుసగా 12%, 7 శాతంగా ఉంది.
సోనీ కంపెనీ సరఫరాలు 19% వృద్ధిని నమోదు చేయగా, దేశీయంగా ఈ కంపెనీకి 7% వాటా ఉంది. 'దిగ్గజ, అందరికీ తెలిసిన బ్రాండ్లకు వినియోగదార్లు ప్రాధాన్యం ఇస్తున్నారు. శామ్‌సంగ్, ఎల్‌జీ, షియోమీ బ్రాండ్ల స్మార్ట్ టీవీలకు గిరాకీ బాగుంది. టాప్-5 కంపెనీల వాటా 2024 తొలి త్రైమాసికంలో 57 శాతానికి చేరింది. 2023 ఇదే సమయంలో ఇది 41 శాతంగానే నమోదైంద'ని రీసెర్చ్ అనలిస్ట్ ఆకాశ్ జత్వాలా వెల్లడించారు. మధ్య స్థాయి (మిడ్-టైర్) కంపెనీల్లో హైసెన్స్, పానసోనిక్, వెస్టెల్, తోషిబా, మోటోరోలా వంటివి వృద్ధి నమోదు చేశాయని, ఇవి క్యూఎల్‌ఈడీ టీవీలను 4కే రెజొల్యూషన్‌తో, మెరుగైన దృశ్య అనుభూతితో తక్కువ ధరకే అందిస్తున్నాయని పేర్కొన్నారు.


## నదిలో మునిగి రష్యాలో నలుగురు భారతీయ వైద్య విద్యార్థుల మృతి

మాస్కో:
రష్యాలో విషాదం చోటుచేసుకుంది. భారత్‌కు చెందిన నలుగురు వైద్యవిద్యార్థులు ప్రమాదవశాత్తు వోలో?వ్ నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరి మృతదేహాలను వెలికి తీయగా.. మిగతా వాటి కోసం గాలిస్తున్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ సమీపంలోని యారోస్లావ్ ది వైస్ నోవ్‌గొరోడ్ స్టేట్ యూనివర్సిటీలో చదువుతున్న కొందరు విద్యార్థులు బుధవారం తమకు సమీపంలోని వోలో?వ్ నది ఒడ్డుకు వాకింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తూ నీటిలో జారిపడింది. ఆమెను కాపాడేందుకు నలుగురు విద్యార్థులు నదిలోకి దిగారు. ఈ ప్రయత్నంలో ముగ్గురు విద్యార్థులు కొట్టుకుపోగా ఓ అమ్మాయిని స్థానికులు కాపాడారు. మృతులను మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాకు చెందిన హర్షల్ అనంత్‌రావ్, జీషన్ పింజారీ, జియా పింజారీ, మాలిక్ మహమ్మద్ యాకూబ్‌లుగా గుర్తించారు.

## ఆయుధాలను ఆపినందుకు క్షమించండి

### ఉక్రెయిన్ అధ్యక్షుడికి తెలిపిన బైడెన్‌మీ ప్రత్యర్థులకు ఆయుధాలిస్తాం పుతిన్

పారిస్:
ఉక్రెయిన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ క్షమాపణలు చెప్పారు. ఆయుధాలకు అవసరమైన నిధులను సకాలంలో పంపించకపోవడంతో ఖర్కివ్‌లో రష్యా ఆక్రమణలు కొనసాగాయని, అందులో తన బాధ్యత కూడా ఉందని అన్నారు. అమెరికా కాంగ్రెస్‌లో విభేదాల కారణంగా ఉక్రెయిన్ ఆయుధ ప్యాకేజీ కొన్ని నెలల పాటు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఇటీవలే ఆమోదం పొందింది. అయితే ఆ సమయంలో రష్యా దూకుడు పెంచింది. ముఖ్యంగా ఖర్కివ్ లోని చాలా ప్రాంతాలను ఆక్రమించింది. రెండో ప్రపంచయుద్ధానికి సంబంధించిన డీ డే ఉత్సవాల్లో హాజరయ్యేందుకు పారిస్ వచ్చిన బైడెన్‌ను జెలెన్‌స్కీ కలిశారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు క్షమాపణ చెప్పారు. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని అభయమిచ్చారు. మరోవైపు అమెరికా, దాని మిత్ర పక్షాల ప్రత్యర్థులకు ఆయుధాలు సరఫరా చేసే అంశాన్ని రష్యా పరిశీలిస్తోందని మరోసారి పుతిన్ హెచ్చరించారు. ఏయే దేశాలకు లేదా సంస్థలకు ఈ ఆయుధాలను రష్యా పంపించనుందన్న విషయాన్ని పుతిన్ వెల్లడించలేదు. "వారు (పాశ్చాత్య దేశాలు) పంపిన ఆయుధాలు ఉక్రెయిన్ మాపై ఉపయోగిస్తే మాకు కూడా అలా చేసే హక్కు ఉంటుంది" అని రష్యా అధ్యక్షుడు పేర్కొన్నారు.



## బ్యాంకుఖాతా కేవైసీ ఆన్‌లైన్‌లో

# సులువుగా చేసుకోండిలా..




బ్యాంకులో ఖాతా ఉన్నా.. మ్యూచువల్ ఫండ్‌లో మదుపు చేస్తున్నా.. ఇతర ఆర్థిక కార్యకలాపాలు సజావుగా జరగాలన్నా కేవైసీ (మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి) వివరాలు తెలియజేయడం తప్పనిసరి.
కస్టమర్ల ఖాతాకు భద్రతను పెంచడంతో పాటు, మోసాలను నివారించడంలో భాగంగా బ్యాంకులు కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కోరుతుంటాయి. ఈ ప్రక్రియను ఎలా పూర్తి చేయాలో తెలియక చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. ప్రస్తుతం అనేక బ్యాంకులు తమ కస్టమర్లకు కేవైసీ వివరాలు ఆన్‌లైన్‌లోనే అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని అందిస్తున్నాయి. బ్యాంక్ పోర్టల్‌లోకి వెళ్లి సులువుగా కేవైసీని అప్‌డేట్ చేసుకోవచ్చు. బ్యాంకును బట్టి ఈ ప్రక్రియలో చిన్న చిన్న మార్పులుంటాయి. ప్రధాన బ్యాంకుల్లో ఈ ప్రక్రియ ఎలా ఉంటుందో ఇక్కడ చూద్దాం..
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: ఎస్‌బీఐ ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో పోర్టల్‌లోకి లాగిన్ అయ్యి My Accounts & Profile సెక్షన్ కింద కనిపించే Update KYCపై క్లిక్ చేయాలి. ఎస్‌బీఐ అకౌంట్‌ను ఎంచుకొని Next పై క్లిక్ చేసి మీరు సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయాలి. హెచ్‌డీఎఫ్‌సీ: హెచ్‌డీఎఫ్‌సీలో రీ- కేవైసీని వెబ్‌సైట్‌లోనే సులువుగా చేసుకోవచ్చు. పోర్టల్‌లోని వ్యక్తిగత విభాగంలో దీనికి సంబంధించిన లింక్ ఉంటుంది. లేదంటే బ్యాంక్ నుంచి సంబంధిత ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపి, పత్రాలు జోడించి దగ్గర్లోని బ్యాంకు శాఖకు పంపించాలి. లేదంటే నేరుగా బ్యాంకు శాఖలో అందించొచ్చు. ఐసీఐసీఐ: ఐసీఐసీఐ నెట్ బ్యాంకింగ్ పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి. ఒకవేళ మీ కేవైసీ అప్‌డేట్ చేయాల్సిఉంటే స్క్రీన్‌పైనే చూపిస్తుంది. అక్కడే కనిపించే ఆథరైజేషన్ బాక్స్‌పై టిక్ చేసి Update Through Document Upload ఆప్షన్‌ను ఎంచుకోండి. వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే వాటిని అప్‌డేట్ చేసి పాన్ కార్డ్‌ను అప్‌లోడ్ చేయాలి. చిరునామా వివరాలను కూడా అక్కడే మార్చుకోవచ్చు.
కెనరా బ్యాంక్: లాగిన్ వివరాలతో కెనరా బ్యాంక్ వెబ్‌సైట్లో లాగిన్ అవగానే services కింద కనిపించే Re-KYC పై క్లిక్ చేసి వివరాలు అప్‌డేట్ చేసేయొచ్చు. యెస్ బ్యాంక్ అయితే.. బ్యాంక్ పోర్టల్‌లో లాగిన్ అవ్వగానే రీ- కేవైసీని పాప్-అప్ ఉంటుంది. ఆధార్ అథెంటికేషన్‌లో కేవైసీ పూర్తి చేయొచ్చు. చిరునామాల్లో ఏవైనా మార్పులున్నా చేసుకోవచ్చు. పాస్‌పోర్ట్, పాన్ కార్డ్, భారత ప్రభుత్వం జారీ చేసిన ఈ- ఆధార్ లెటర్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, NREGA జారీ చేసిన జాబ్‌కార్డ్ లను చిరునామా, ఐడీ ప్రూఫ్‌గా అంగీకరిస్తారు.


# చెల్లింపుల్లో వైఫల్యానికి బ్యాంకులదే లోపం




ముంబయి: డిజిటల్ చెల్లింపుల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు బ్యాంకులే కారణమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. దీనికి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వ్యవస్థలకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. 'యూపీఐ చెల్లింపుల్లో అంతరాయాలకు కారణాలను విశ్లేషించడానికి ప్రతి ఒక్క సంఘటననూ ఆర్‌బీఐ అధికారులు అధ్యయనం చేస్తారు. ఇందులో యూపీఐ, ఎన్‌పీసీఐ వ్యవస్థల్లో ఎలాంటి సమస్యలూ కనిపించలేదు. సమస్య బ్యాంకు వైపు నుంచే వస్తోంది. దీనిపై మేమూ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు. అంతరాయాలపై పరిశోధిస్తున్నప్పుడు ఆర్‌బీఐ బృందాలు ఎన్‌పీసీఐ వ్యవస్థనూ తనిఖీ చేస్తాయని ఆయన పేర్కొన్నారు. బ్యాంకులు తమ డిజిటల్ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సిస్టమ్ డౌన్‌లాంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలనే విషయంలో ఆర్‌బీఐ చాలా కఠినంగా వ్యవహరిస్తోందని, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో బయటపడిన లోపాల్లాంటివి గుర్తిస్తే, బ్యాంకులపై ఆంక్షలు విధిస్తున్నామని వివరించారు. సాంకేతిక వ్యవస్థల పటిష్ఠత కోసం బ్యాంకులు తగిన స్థాయిలో పెట్టుబడులు పెడుతున్నాయని, వ్యాపార వృద్ధికి అనుగుణంగా ఐటీ వ్యవస్థల్లో వేగం పెంచేలా చూసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతికతపై ఎంత ఖర్చు చేసేదీ బ్యాంకుల ఇష్టమని, అదే సమయంలో విపత్తు వచ్చినప్పుడు రికవరీ వ్యవస్థలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని బ్యాంకులకు సూచించారు.
వడ్డీ రేట్ల విషయంలో పారదర్శకత ఉండాలి: యూపీఐ లైట్ ద్వారా నెలకు కోటికి పైగా లావాదేవీలు జరుగుతున్నాయని, ఇవి పెరిగే కొద్దీ బ్యాంకు సర్వర్లపై ఒత్తిడి తగ్గుతుందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టి.రబి శంకర్ తెలిపారు. కొన్ని సంస్థలు అధిక వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నాయనే ప్రశ్నకు మరో డిప్యూటీ గవర్నర్ జెస్వామినాథన్ స్పందిస్తూ.. వడ్డీ వసూలు విషయంలో పారదర్శకత పాటించాలని, సహేతుకంగా ఉండాలని తమ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. కొన్ని సంస్థలు అధిక వడ్డీలను విధిస్తున్నాయని.. అందువల్ల మొత్తం ఆర్థిక వ్యవస్థ ఇలాగే ఉందని చెప్పలేమన్నారు. కొన్ని బ్యాంకులు కీలక ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు ఇవ్వడం లేదని, వీటిపై నియంత్రణ సంస్థ తనిఖీలు చేస్తోందని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ వివరించారు.


### మొబైల్ ఫోన్ విడిభాగాలపై

## 10% కస్టమ్స్ సుంకం



దిల్లీ: మొబైల్ ఫోన్ డిస్‌ప్లే అసెంబ్లింగ్ కోసం ఉపయోగించే విడిభాగాలైన టచ్ ప్యానెల్, కవర్ గ్లాస్, ఎల్‌ఈడీ బ్యాక్‌లైట్ వంటి వాటిపై 10% దిగుమతి సుంకం విధిస్తున్నట్లు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు(సీబీఐసీ) శుక్రవారం స్పష్టం చేసింది. ఫ్రేమ్, సిమ్ ట్రే, పవర్/వాల్యూమ్ బటన్ వంటి సైడ్ బటన్‌లపైనా 10% కస్టమ్స్ సుంకం వర్తిస్తుంది. తాజా నిర్ణయం పరిశ్రమకు పెద్ద ఊరట అని, అనవసర గందరగోళం ఇక ఉండదని ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మొహింద్రో అన్నారు.

## అత్యాచారాలు, హత్యలు జరిగినా మీకు ఫర్వాలేదా?: కంగనా ఆగ్రహం



బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ను చండీగఢ్ విమానాశ్రయంలో ఓ సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెంపదెబ్బ కొట్టిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనిపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమెకు మద్దతుగా నిలవగా.. మరికొందరేమో కానిస్టేబుల్ చర్యను సమర్థిస్తున్నారు. ఈ క్రమంలోనే దాడి ఘటనపై మరోసారి స్పందించిన కంగనా.. ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఇక అత్యాచారాలు, హత్యలు జరిగినా మీకేం ఫర్వాలేదా?' అంటూ కానిస్టేబుల్‌కు మద్దతిచ్చిన వారిని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "అత్యాచారానికి పాల్పడినవాడు.. హంతకుడు.. దొంగ.. ఇలా నేరం చేసినవారు ఎవరైనా భావోద్వేగ, మానసిక, ఆర్థికపరమైన కారణాలు చెబుతుంటారు. కారణం లేకుండా ఏ నేరం జరగదు. అయినా సరే చేసిన నేరానికి వారిని దోషిగా తేల్చి శిక్ష విధిస్తారు. అలా కాదని చట్టాన్ని ఉల్లంఘించి నేరాలకు పాల్పడిన క్రిమినల్స్ భావోద్వేగాలకు విలువిస్తే.. అనుమతి లేకుండా ఓ వ్యక్తి శరీరాన్ని తాకడం, వారిపై దాడి చేయడం వంటి ఘటనలను మీరు సమర్థిస్తే.. అత్యాచారాలు, హత్యల వంటివి జరిగినా మీకేం ఫర్వాలేదనే అర్థం. మీలాంటివారు మీ మానసిక పరిస్థితిపై మరింత దృష్టిపెట్టుకోవాలి. యోగా, ధ్యానం చేయండి. లేదంటే జీవితం చేదు అనుభవంగా మారుతుంది. పగ, ద్వేషం, అసూయతో ఉండకండి. వాటినుంచి ఇకనైనా విముక్తి పొందండి" అని కంగనా రాసుకొచ్చారు. గత గురువారం దిల్లీ విమానాశ్రయంలో కంగనకు ఈ చేదు అనుభవం ఎదురైంది. భద్రతా తనిఖీ చేసుకొని ముందుకువెళుతున్న కంగనను అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ చెంపపై కొట్టారు. దీంతో భద్రతా అధికారులు కంగన చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. సాగు చట్టాలకు వ్యతిరేకంగా దిల్లీ సరిహద్దుల్లో గతంలో ఆందోళన నిర్వహించిన మహిళా రైతుల విషయంలో కంగన అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకే కొట్టానని ఆ కానిస్టేబుల్ చెప్పారు. ఈ ఘటనపై బాలీవుడ్ ప్రముఖులు స్పందించకపోవడంపై కంగనా ఆగ్రహం వ్యక్తంచేశారు.

# NATIONAL International



## మోదీకి అభినందనలు చెప్పని పాక్..

ఇస్లామాబాద్:
సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి మెజార్టీ సాధించి, మూడోసారి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం అవుతోంది. మరోసారి నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.
ఈ తరుణంలో ప్రపంచవ్యాప్తంగా దేశాల అధినేతలు ఆయనకు అభినందనలు తెలియజేశారు. దాయాది దేశం పాకిస్థాన్ నుంచి మాత్రం ఎలాంటి స్పందనా రాలేదు. దీనిపై పాక్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జాహ్రా బలోచ్ ఏమన్నారంటే..
"భారత్ ఎన్నికల ప్రక్రియపై మేం మాట్లాడానికి ఏమీ లేదు. ఇంకా అక్కడ అధికారికంగా కొత్త ప్రభుత్వం ఏర్పడలేదు కాబట్టి.. ఇప్పుడే అభినందనలు చెప్పడం తొందరపాటే అవుతుంది" అని బలోచ్ వెల్లడించారు. నిర్మాణాత్మక చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని పాక్ కోరుకుంటుందని చెప్పారు. దాయాది దేశంతో సత్సంబంధాలనే కోరుకుంటున్నట్లు భారత్ కూడా పలుమార్లు చెప్పింది. 'పాకిస్థాన్‌తో చర్చలకు తలుపులు మేం ఎప్పుడూ మూయలేదు. పెద్ద సంఖ్యలో ఉగ్రవాద కేంద్రాలు ఉన్న దేశంతో చర్చించాల్సి వస్తే.. ముఖ్యంగా దాని గురించే మాట్లాడాలి. ఇతరత్రా సమస్యలు ఉన్నా కూడా ప్రధానంగా ఉగ్రవాదంపైనే చర్చ ఉంటుంది" అని ఎస్. జై శంకర్ గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే.
ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో మోదీ ప్రధానిగా మూడోసారి ప్రమాణం చేయనున్నారు. దీనికి సంబంధించిన లాంఛనాలన్నీ పూర్తిచేశారు. అట్టహాసంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈనెల 5న ఎన్డీయే పార్టీల నేతలు కలిసి నరేంద్రమోదీని తమ నాయకుడిగా ప్రకటించగా శుక్రవారం కూటమి ఎంపీలంతా సమావేశమై ముక్తకంఠంతో ఆమోదముద్ర వేశారు.

## అమెరికాలో ఎండలు భగభగ



రీనో: అమెరికాలోని నైరుతీ రాష్ట్రాలను భానుడి ప్రచండతాపం బెంబేలెత్తిస్తోంది. ఆగ్నేయ క్యాలిఫోర్నియా మొదలుకొని అరిజోనా, నెవడా రాష్ట్రాల వరకు గురు, శుక్రవారాల్లో పగటి ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. నెవాడా రాష్ట్రంలోని లాస్ వేగాస్‌లో శనివారం కూడా వేడి గాలులు కొనసాగనున్నాయి. నైరుతి అమెరికాలో వేసవి మొదలుకావడానికి ఇంకా రెండు వారాల వ్యవధి ఉన్నా సూర్య ప్రతాపం ముందే మొదలైంది. ఫీనిక్స్ పట్టణంలో 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదై కొత్త రికార్డు నెలకొల్పింది. 2016లో ఇక్కడ నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రత 44 డిగ్రీలు. ఫీనిక్స్‌లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ సభకు వచ్చిన వారిలో 11 మంది వడదెబ్బ తగలడంతో ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది. నెవడా రాష్ట్రంలోని రీనో నగరంలో సాధారణంగా 27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. గురువారం అక్కడ 37 డిగ్రీలు నమోదైంది. అరిజోనా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కొనసాగనున్నది.

## పుణె కారు ప్రమాద ఘటన.. నిందితుడి కుటుంబం రిసార్ట్‌పైకి బుల్డోజర్



సతారా: మహారాష్ట్రలోని పుణెలో ఇటీవల ఓ టీనేజర్ మద్యం తాగి, లగ్జరీ కారును ర్యాష్‌గా నడిపి ఇద్దరి మృతికి కారణమైన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడికి సంబంధించి మరో వార్త బయటికొచ్చింది. ఆ టీనేజర్ కుటుంబానికి చెందిన ఓ రిసార్ట్‌లో అక్రమ కట్టడాలను అధికారులు శనివారం కూల్చేశారు. మహాబలేశ్వర్ లోని మల్కంపేట్ ప్రాంతంలో నిందితుడి కుటుంబానికి 'ఎంపీజీ క్లబ్' పేరుతో ఓ రిసార్ట్ ఉంది. అందులో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కొన్ని నిర్మాణాలు చేపట్టినట్లు సమాచారం అందింది. దీనిపై గతవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే స్పందించారు. అవి అక్రమ కట్టడాలు అని తేలితే ఆ రిసార్ట్‌పై చర్యలు తీసుకోవాలని సతారా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలోనే గతవారం రిసార్ట్ ను అధికారులు సీల్ చేశారు. అనంతరం దీనిపై విచారణ జరపగా ఆ కట్టడాలు అక్రమంగా నిర్మించినట్లు తేలింది. దీంతో శనివారం ఎంపీజీ క్లబ్ వద్దకు బుల్డోజర్ (%దీబశ్రీశ్రీఎశీఓవతీ%)ను తరలించారు. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను కూల్చేసినట్లు అధికారులు వెల్లడించారు. పుణె నగరంలోని సంపన్న స్థిరాస్తి వ్యాపారి కుమారుడు.. మే 19 తెల్లవారుజామున లగ్జరీ కారును వేగంగా నడిపి ఓ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు టెకీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు విధించిన షరతులతో ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తన కుమారుడిని తప్పించేందుకు ఆ వ్యాపారి తీవ్రంగా యత్నించాడని, కుమారుడి రక్త నమూనాలను మార్చేందుకు డాక్టర్‌కు లంచం ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఈ కేసులో నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులు, తాతను పోలీసులు అరెస్టు చేశారు.

## బిఆర్ఎస్ పూర్తిగా చతికిల పడినట్లేనా ?

# పార్లమెంట్ ఫలితాల తరవాత కింకర్తవ్యం



హైదరాబాద్, (ప్రజా మంటలు): పార్లమెంట్ ఫలితాల తరవాత తెలంగాణలో బిఆర్ఎస్ పూర్తిగా చతికిల పడినట్లే. ఊతకర్ర పట్టుకుని లేద్దామన్నా లేవలేని పరిస్థితి. కనీసం ఒక్కసీటు కూడా దక్కించుకోలేక పోయారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడో ఒకచోట గెలిచినా పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తికి ఇవి అద్దం పట్టాయి. దీనికితోడు ఇక ముున్ముందు అక్రమాలకు సంబంధించిన కేసులు కూడా వెన్నాడనున్నాయి. పార్టీలో ఉన్న కేడర్ కూడా ఇప్పటికిప్పుడు నమ్మి వెన్నంటి నడిచేంతగా పరిస్థితులు ఉండవు. ఫోన్ ట్యాపింగ్, భూ ఆక్రమణలు, ధరణి దగుల్బాజీ వంటి అక్రమాలన్నీ ఇక తన్నుకు వస్తాయి. కాళేశ్వరం అవినీతి కళ్లకు కనిపిస్తోంది. దర్యాప్తు సంస్థలు ఇప్పటికే అవకతవకలు జరిగాయని ఘోషిస్తున్నాయి. ఈ సమసయంలో కాంగ్రెస్ను తిడుతుంటే కలసివచ్చేదేమీ లేదు. అలాగే ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా కదలలేని పరిస్థితి వస్తుంది. కేసుల నుంచి తప్పించుకునే వీలుండదు. తూఛ్ అని కొట్టి పారేయడానికి లేదు. కక్షసాధింపు చర్యలు అనడానికి కూడా లేదు. ఎందుకంటే అన్నీ కళ్లముందే

కనిపిస్తున్నాయి. అధికారులను నమ్ముకుని, స్వార్థాన్ని జోడించి చేసే పాలన ఇలాగే ఉంటుంది. ఇకపోతే కెసిఆర్ హయాంలో కూడా సిఎంఒలో కార్యదర్శిగా పని చేసిన రాజశేఖర్ రెడ్డి వ్యవహార శైలిపై కూడా ప్రస్తుతం రాజకీయ అధికార వర్గాల్లో దుమారం రేగుతున్నది. రాజశేఖర్ రెడ్డి కూడా కెసిఆర్‌ను ప్రజా ప్రతినిధులకు దూరం చేశారని, ఏనాడు వారు ప్రజా సమస్యలతో ప్రగతి భవన్‌కు వస్తే వారిని కెసిఆర్‌తో కలిసే అవకాశం కల్పించే వారు కాదని మాజీ ఎంఎల్ఏలు అంటున్నారు. తమ అధినేతను కలిసే అవకాశం నిరాకరించడమే కాకుండా అపాయింట్ మెంట్ పేరిట గంటల తరబడి నిరీక్షణకు గురి చేసేవాడని వారు చెబుతున్నారు. అధినేత భేటీకి ఈ అధికారే అడ్డుగా మారడంతో తమ సమస్యలే కాకుండా ప్రజా క్షేత్రంలోని నిజ సమస్యలు కూడా సిఎం దృష్టికి చేరేవి కాదని ఫలితంగా ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా అధికారం కోల్పోవలసి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి సిఎం కెసిఆర్‌కు నీడలా ఉండేవారు. ఆయన కేంద్రంలో మంత్రిగా పని చేసినప్పుడు కూడా రాజశేఖర్ రెడ్డి కెసిఆర్ పేషీలో నిర్ణయాత్మక పాత్ర వహించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కెసిఆర్‌కు చివరి దాకా వెన్నంటి ఉన్నారు. కాని ఇప్పుడు ఆయన వ్యవహార శైలిపై పలు రకాలుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ మూడు ప్రభుత్వాల పతనానికి సిఎంఒ అధికారుల వివాదాస్పద పాత్రనే పూర్తిగా కారణం కాకున్నా అనేక కారణాల్లో ఇదే బలమైన కారణమని వారు ఎన్నో సంఘటనలు ఉదహరిస్తూ చెబుతున్నారు. ఈ అనుభవాల ఫలితమో మరేమిటో గాని నాలుగో సారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టబోతున్న నారా చంద్రబాబు నాయుడు ఎంపిల సమావేశంలో ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. తన పరిపాలనకు కేంద్రమైన సిఎంఒలో బ్యూరోక్రాట్ల పాలన ఉండదని తానే అన్నీ ఇకపై చూస్తానని, వింటానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాననే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారిన చంద్రబాబును చూస్తారని అంటు న్నారు. నిజానికి ముఖ్యమంత్రులుగా ఉన్నవారు ప్రజల మనసెరిగి పాలన సాగించాలి. అధికారుల పాత్రెంతవరకు అన్నది నిర్దేశించుకోవాలి. లేకుంటే ప్రజల్లో అభాసు పాలు కావడమే గాకుండా ఓటమి చెందుతారని గుర్తించాలి.

## బయటపడుతున్న ధరణి అక్రమాలు

హైదరాబాద్, (ప్రజా మంటలు): ధరణి పోర్టల్ చుట్టూ వివాదాలు సద్దు మణగలేదు. ధరణిని అడ్డం పెట్టుకుని చేసిన చేతివాటాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ప్రభుత్వ భూములను కిందిస్థాయిలో అధికారులు కూడా అమ్మేసుకున్నారు. గ్రామాల్లో ధరణితో తాము నష్టపోతున్నామంటూ ఆందోళనల చెందుతున్న వారి సంక్య పెరుగుతున్నాయి. ధరణితో కెసిఆర్, ఆయన అనుచరులు భూములను కాజేసిన వ్యవహారం మెల్లగా బయటపడుతోంది. తాజాగా రాంగారెడ్డి శంషాబాద్‌లో ప్రభుత్వ భూములను కాజేసిన తీరు ఆప్చర్యం కలిగిస్తోంది. అయితే ధరణి మొదలు పెట్టినప్పటి నుంచే వివాదాలు, రైతుల ఆత్మహత్యల బెదిరింపులు, పంచాయితీలు, కొట్లాటలు నడిచాయి. అక్రమాలను పట్టించుకోని కెసిఆర్.. ధరణిపై విమర్శలు చేసే వారిని బంగాళాఖాతంలో విసిరేయాలని కెసిఆర్ స్వయంగా పిలుపునిచ్చారు. ఆయన ఎన్నికల ప్రచారం అంతా ఇలాగే సాగింది. మొత్తంగా ధరణి పోర్టల్ వివాదం తెలంగాణలో పెను రాజకీయ ప్రకంపనలను రేపింది. కాంగ్రెస్ అధికారం చేపట్టాక కోదండరెడ్డి అధ్యక్షతన కమిటీ వేసింది. కమిటీ దీనిపై లోతుగా అధ్యయనం చేస్తోంది.

# అనంత లోకాల్లోకి దూసుకెళ్లిన ధ్రువతార - రామోజీ రావు



### తెలుగు పత్రికారంగానికి చిరస్మరణీయుడు

హైదరాబాద్ జూన్ 09 :
తెలుగు పత్రికా రంగాన దృవతారగా వెలిగిన చెరుకూరి రామయ్య అలియాస్ రామోజీరావు, ఈ ప్రపంచాన తన యాత్ర ముగించుకొని, ఆయన నమ్మే ఆపై లోకాలకో, స్వర్గానికో మారెక్కడికో ఎగిరిపోయాడు. ఆయన మృతికి తెలంగాణ జాతీయ దినపత్రిక "ప్రజా మంటలు" కుటుంబం, రామోజీ రావు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతుంది.

సరిగ్గా యాభై ఏళ్ల క్రితం, మొన్నటి వార్తలను మధ్యాహ్నానికి మోసుకొచ్చే తెలుగు పత్రికలకు పోటీగా, ఉదయం ఆరు గంటలకే ఇంటి ముంగిట తాజా వార్తల సమాహారాన్ని అందించే పత్రికగా, ఉత్తరాంధ్ర కేంద్రమైన విశాఖపట్నంలో తాను ప్రారంభించిన "ఈనాడు" దినపత్రిక ద్వారా ప్రపంచానికి పరిచయమైన రామోజీ రావు, నాలుగైదేళ్ల తరువాత హైదరాబాద్ కు తన మఖాం మార్చి, పత్రికారంగానికి ఉషోదయం కల్పించాడు. తెలుగు భాష అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన రామోజీరావు, సమగ్ర తెలుగు నిఘంటువు రూపకల్పనకు చేస్తున్న ప్రయత్నం ఇంకా ఒక కొలిక్కి వచ్చినట్లు లేదు.

పత్రికా రంగాననే కాకుండా సినిమా రంగంలో కూడా నూతనోత్సాహాన్ని నింపే కొత్త కథలకు, కథనాలకు, యువకులకు ప్రత్సాహం అందించిన గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తి రామోజీరావు. మయూరి, ప్రతిఘటన, చిత్రం లాంటి వైవిధ్యమైన కథాంశాలతో చిత్రాలను నిర్మించారు. తెలంగాణ పోరాట చరిత్రను, ఆనాటి నిజాం పాలంలోని పైశాచికత్వాన్ని తెలిపే "విముక్తి కోసం" లాంటి సినిమాలను పంపిణీ చేసిన రామోజీ రావు సినిమారంగానికి ఎనలేని సేవలు అందించారు.

తెలుగు పత్రికా భాషను మార్చి, కొత్త పదాలకు, కొత్త సొగసులకు రూపం దిద్దాడు. పత్రికా విలేఖరులకు శిక్షణ ఇస్తూ, భాష పై పట్టు ఎలా సాధించాలో నేర్పిన సంస్థ ఈనాడు అధినేత. పత్రికారంగంలో వచ్చిన ప్రతి మార్పును స్వాగతిస్తూ, జిల్లా కేంద్రాన్ని ప్రచురణ కేంద్రాలుగా ఏర్పాటు చేసుకొని, జిల్లా వార్తలకు ప్రత్యేక సంచికను అందించే సరికొత్త ప్రయోగం చేసి, గ్రామీణ, రాజకీయ, సామాజిక వార్తల ప్రాధాన్యాన్ని పెంచి, సామాన్య ప్రజలకు కూడా పత్రికను దగ్గర చేశాడు. పెట్టుబడిదారు రాజకీయాలను ప్రోత్సహించినా, పత్రిక నిండా వామపక్ష భావాలు నిండిన మేధావులకు పెద్ద పేట వేశారు. వామ పక్ష పార్టీల వార్తలకు అంత ప్రాధాన్యత ఇవ్వకున్నా, మేధావులకు ఆశ్రయం ఇస్తూ, ఆ తరువాతి కాలంలో వచ్చిన అనేక పత్రికలకు సంపాదకులను అందించిన కర్మాగారం ఈనాడు అని గుర్తుచేసుకోక తప్పదు. ఈనాడు గొప్పగా చెప్పుకొంటున్న అనేక మంది పాత్రికేయులు, ఇక్కడి నుండి వచ్చిన వారే.

రాజకీయంగా ఆయన ఆలోచనలు ఎలా ఉన్నా, తెలుగు రాష్ట్రాలలో బహు విధమైన పరిశ్రమలను స్థాపించడంలో, వేలాది మందికి ఉపాధి కల్పించడంలో, ఇటీవలి కాలంలో రామోజీరావు ను మించిన వ్యక్తి లేదనడం అతిశయోక్తి కాదు. ప్రపంచంలోనే ఎంతో కీర్తి గడించిన "రామోజీ ఫిల్మ్ సిటీ" నిర్మాణ ఆలోచన తెలుగు వారందరినీ గర్వించే లా చేసింది. రాజకీయ కారణాలతో ఎన్ని సమస్యలు వచ్చినా, తన ఆలోచనలను అమలు చేసి, హైదరాబాద్ కే కాకుండా, దేశానికే గర్వకారణమైన "రామోజీ ఫిల్మ్ సిటీ" నిర్మించి, నిర్వహించడం ఎంతో గొప్ప విషయం.

దేశంలో అప్పుడప్పుడే టివి రంగం విస్తరిస్తున్న తరుణంలో ఈటీవీ ని ప్రారంభించి, 16 భాషలలో విస్తరించిన ఘనుడు. టి వి రంగానికి పోటీగా వస్తున్న డిజిటల్ వ్యవస్థను కూడా అందిపుచ్చుకొని ఈటీవీ డిజిటల్, ఈటీవీ భారత్ లతో పాటు, ఈటీవీ విన్ మొబైల్ ఆప్ లాంటి మీడియా సంస్థలతో ప్రపంచ తెలుగు ప్రజలకు తెలుగు భాషను, నుడికారాన్ని అందిస్తూ, దేశంలోని అన్నీ ప్రాంతాల వార్తలను ఎప్పటికప్పుడు అందించే ప్రయత్నం చేస్తున్న మొనగాడుగా చెప్పుకోవాలి. లాంటి మహానుభావుడు ఈనాడు భౌతికంగా దూరం అయినా, ఆయన ఆలోచనలు ఎప్పుడు తెలుగు వారితోనే ఉంటాయి.

# మృగశిరకార్తె ప్రవేశంతో తొలకరి

### తొలకరిజల్లులతో జీవకోటికి స్వాంతన

వేములవాడ, (ప్రజా మంటలు): మృగశిర కార్తె వచ్చిందంటే సకలజనులకు పూరట కలుగుతుంది. అప్పటివరకు గ్రీష్మతాపంతో అల్లాడుతున్న సర్వకోటి జీవాలు తొలకరిజల్లులతో స్వాంతన చెందుతారు. రోహిణికార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయి. అనంతరం మృగశిర కార్తె వస్తుంది. రుతుపవనాల రాకను మృగశిరకార్తె ఆహ్వానిస్తుంది. చంద్రుడు ఏ నక్షత్రంలో ప్రవేశిస్తే ఆ రాశి ప్రారంభమవుతుంది. జింక తల కలిగివుండటంతో ఈ కార్తెను మృగశిరకార్తెగా వ్యవహరిస్తారు. ఈ కార్తె మనదేశంపై విశేషప్రభావం చూపుతుంది. ఎందుకంటే ఈ రాశిలోనే నైరుతి రుతువపనాలు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. అప్పటివరకు నిప్పులు చెలరేగిన భానుడి కిరణాలు నల్లటి మేఘాల ప్రభావంతో చల్లబడుతాయి. దేశానికి జీవధార అయిన వర్షాలతో నేలతల్లి పులకరిస్తుంది. రైతులు తొలకరి జల్లులు పడగానే దుక్కి దున్ని పంటలు వేసేందుకు సిద్ధమవుతారు. ఏరువాకసాగే కాలం అని కూడా అంటారు. మృగశిర నక్షత్రం దేవగణానికి చెందినది. అధిపతి కుజుడు. రాశి అధిపతులు శు క్రుడు, బుధుడు. ఈ నక్షత్రంలో జన్మించినవారు మంచి అదృష్టం కలిగివుంటారు. సూర్యుడు ఒక్కొక్క నక్షత్రంలో 14 రోజుల పాటు ఉంటాడు. సూర్యుడు ఏ నక్షత్రానికి సమీపంలో ఉంటే ఆ కాలానికి (కార్తె) ఆ నక్షత్రం పేరు పెడుతారు. సౌరమానం ప్రకారం లెక్కించబడటంతో ఈ కార్తెలు ఆంగ్ల గ్రిగోరియన్ క్యాలెండర్ ప్రకారం దాదాపు ప్రతి సంవత్సరం ఒకే తేదిల్లో వస్తాయి. పురాణగాధ ప్రకారం మృగశిరస్సు కలిగిన మృగవ్యాధుడు అను వృతాసురుడు వరప్రభావంచే పశు వులను, పంటలను హరించి వేయడం ప్రకృతి భీభత్సాలాను సృష్టించడం, వర్షాలకు అడ్డుపడటం జరుగుతూ ఉండేడిది. ఇతను చనిపోకుండా అనేక వరాలు కలిగి ఉండటంచేత ఇంద్రుడు సముద్ర హలల నుండి వచ్చే నురుగును ఆయుధంగా చేసి చంపేస్తాడు. ఈ కథ ఆధారంగా ఖగోళంలో ఇంద్ర నక్షత్రమైన జ్యేష్టాకు మృగశిరకు 180 డిగ్రీల దూరంలో ఉండటం వలన తూర్పు ఆకాశంలో ఇంద్ర నక్షత్రం ఉదయించగానే వృతాసుర నక్షత్రం అస్తమిస్తుంటుంది. ఇక్కడ నురుగు అనేది ఋతుపవనాలకు, వర్షాలకు సూచన. ఇంద్ర నక్షత్రమైన జ్యేష్ట ఉదయించినపుడు సూర్యుడు మృగశిరలోకి ప్రవేశించడం వలన మృగశిరకార్తె ప్రవేశిస్తుంది. వర్షాలు పడకుండా అడ్డుపడ్డ మృగాసురుని చంపిన ఇంద్రుడ్ని వర్షప్రదాతగా, వర్షదేవుడుగా పిలుస్తారు. ఇది కథ. ప్రస్తుతం ఈ కార్తె ప్రవేశానికి ముందు తీవ్రమైన ఎండలతో భూమి అంతా వేడెక్కి మానవ శరీరాలు తాపంతో ఉంటాయి. జూన్ మొదటి వారంలో అంటే సుమారుగా 8తేదీ నుండి ప్రకృతి పరంగా వర్షాలు పడడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాతావరణంలో తీవ్రమైన ఎండల నుండి వర్షాల వలన వాతావరణం చల్లబడడంతో మానవుల శరీరంలో కూడా ప్రకృతి మార్పు ప్రభావం పడుతుంది. శరీరం ప్రకృతి యొక్క మార్పును తట్టుకోవడానికి ఈ రోజు ఇంగువబెల్లం తింటారు. మాంసాహారం తీసుకునే వారు చేపలను తింటారు. శాఖాహారులు మాత్రం ఇంగువను బెల్లంలో కలిపి గుండ్రని గోళిలాగ చేసి దేవుని దగ్గర పెట్టి దండం పెట్టుకుని కుటుంబ సభ్యులందరు అన్ని వయస్సులవారు తప్పక తింటారు. ఈ అయుర్వేద పక్రియ వలన శరీరం బలంగా ఉంచుతూ, రోగనిరోధక శక్తిని ప్రసాదిస్తుంది.

### మానవత్వమే మనిషి బలం !

తిరుమల, (ప్రజా మంటలు): సముద్రం ఇచ్చిన నీరు గ్రహించి సూర్యుడు ఆవిరి చేస్తున్నాడు. ఫలితంగా ఏర్పడిన మేఘాలు వర్షిస్తున్నాయి. ఆ నీరు గ్రహించిన నేల– మనిషికి చెట్టు, ఫలాలు, కలప ఇస్తోంది. వీటిలో దేనికి స్వార్థం ఉంది. ప్రకృతి నుంచి పంచభూతాలనుంచి మనం నేర్చుకో వలసింది ఇదే! ఎంత నిరుపమానమైన త్యాగం చేసి రుషులు, మునులు, పలు, బుధులు, నేతలు సమాజ కల్యాణానికి తమను తాము సమర్పించుకున్నారు. జగతి ప్రగతి కోసం అంకిత మైపోయారు! మనకు మెతుకు ఇవ్వడానికి రైతు । శ్రమిస్తున్నాడు. మనకు బతుకునివ్వడానికి తన ప్రాణాన్ని పణం పెడుతున్నాడు. ఇలా ఎందరెందరో జీవితం అంటే । ఇవ్వ డమన్న మాటలకు సాక్షీభూతులై కనపడుతున్నారు. ఆనందంగా ఉన్న సమయంలో మనతో కలిసి నవ్విన మనిషిని మరిచిపోవచ్చు కాని, కష్టకాలంలో మనతో పాటు విలపించిన మనిషిని మాత్రం మరిచిపోకూడదు. అదే మానవత్వం.

## ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేపప్రసాదం ప్రారంభం

### వివిధ రాష్ట్రాల నుంచి భారీగా ప్రజల రాక

హైదరాబాద్,జూన్8(ప్రజా మంటలు): మృగశిరకార్తె ప్రారంభంతో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం అయ్యింది. చేప మందు కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు బిహార్, యూపీ, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. వేలాదిమందితో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. మందు కోసం ఆస్తమా బాధితులు పెద్దఎత్తున వస్తున్నారు. క్యూలైన్‌లో ఉన్నవారికి నాలుగు గంటలకుపైగా సమయం పడుతోంది. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో నాంపల్లి పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. జూన్ 9 ఉదయం 11గంటల వరకు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. బత్తిని సోదరులు అందించే చేప ప్రసాదం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. అది తీసుకుంటే ఆస్తమా, ఉబ్బసం, శ్వాస సమస్యలు తొలగి పోతాయంటూ కొందరు విశ్వసిస్తారు. దీంతో ప్రతి సంవత్సరం రెండ్రోజులపాటు బత్తిని సోదరులు చేప మందు పంపిణీ చేస్తుంటారు. మృగశిర కార్తె తర్వాత మాత్రమే వారు చేప మందు ఇవ్వడం ప్రత్యేకం. బత్తిని సోదరుల ఇంట్లో ఉన్న బావి నీటిలో ఔషధ గుణాలు ఉంటాయని కొంతమంది విశ్వసిస్తారు. ఆ నీటితో ప్రసాదం తయారు చేయడంతో శ్వాస సంబంధిత బాధితులు ఎగబడుతున్నారు. మందును చేప పిల్లల నోట్లో కుక్కి.. దాన్ని బాధితుల గొంతులో వేస్తారు. దీంతో వారికి శ్వాస సంబంధిత వ్యాధులు తగ్గుతాయని బత్తిని సోదరులు చెప్తుంటారు. కానీ ఈ మందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. చేపమందు కోసం వచ్చే వారి కోసం టీజీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి నాంపల్లికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించింది.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com